J/NELLORE/003/24-26 R.N.I.No.25359/74 పేజీలు : 12
THE BEST TELUGU WEEKLY OF NELLOREANS





# లాయర్

సంపుటి : 44 సంచిక : 19 11.10.2024, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

## ● దివికేగిన రతన్ టాటా

# అస్తమించిన పారిశ్రామిక సూర్యుడు




ప్రపంచ ప్రఖ్యాత పారిశ్రామికవేత్త, పద్మవిభూషణుడు..టాటా సన్స్ గౌరవ ఛైర్మెన్ రతన్ టాటా (86) ఇక లేరు. అనారోగ్యంతో ముంబైలోని బ్రీచ్‌క్యాండీ ఆసుపత్రిలో చికిత్సపొందుతూ, ఈనెల 9వ తేదీ బుధవారం రాత్రి 11.30 గంటల సమయంలో ఆయన తుదిశ్వాస విడిచారు. ప్రపంచవ్యాప్తంగా వంద దేశాల్లో తమ సంస్థలను స్థాపించి.. టాటా గ్రూప్‌ను 10వేలకోట్ల డాలర్ల సామ్రాజ్యంగా విస్తరించిన ప్రతిభాశాలి ఆయన. కోటానుకోట్ల సంపద ఉన్నా.. ఒక చిన్న ఇంట్లోనే అత్యంత సాధారణ జీవితాన్ని గడిపారాయన. అందులోనూ అవివాహితుడు. ఆయన జీవితాన్నంతా పారిశ్రామిక రంగానికి, సామాజిక–ఆధ్యాత్మిక సేవా రంగాలకి అంకితం చేశారు. తన ఆదాయంలో 65 శాతం దాతృత్వానికే వెచ్చించారంటే ఆయన దానగుణం ఎంత ఘనమైనదో చెప్పవచ్చు. దేశంలో కరోనా మహమ్మారి ప్రజల ప్రాణాలు తీస్తున్న వేళ, బాధితులకు అండగా 1500 కోట్ల రూపాయలు విరాళమిచ్చిన దానశీలి రతన్ టాటా. అంతటి మహోన్నత మానవతావాది ఇక లేకపోవడం.. కేవలం భారత్‌కే కాదు, ప్రపంచానికే తీరని లోటు.

10లో




# హర్యానాలో కాషాయ జెండా!

## జమ్ము-కశ్మీరులో నెగ్గని 'మోడీ' అజెండా!!

**దేశంలో తాజాగా జరిగిన హర్యానా, జమ్ము కశ్మీర్ ఎన్నికల్లో ఈసారి ఎగ్జిట్‌పోల్స్‌ను తలకిందులు చేసే ఫలితాలు వచ్చాయి. హర్యానాలో మూడోసారి విజయం సాధించిన కమలనాథులు 'హ్యాట్రిక్' విజయంతో సంబరపడి పోతుంటే, జమ్ముకశ్మీర్ ఫలితాలు మాత్రం వారిని విచారంలో పడేశాయి. హర్యానాలో 90 సీట్లకు 48 స్థానాల్లో బీజేపీ విజయఢంకా మోగించింది. కాంగ్రెస్‌కు 37 స్థానాలే దక్కాయి. అదేవిధంగా, జమ్ము కశ్మీర్‌లో 90 సీట్లకుగాను 29తోనే బీజేపీ సరిపెట్టుకుంది. ఇక్కడ ఎన్‌సి (నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ) 42 స్థానాలు, కాంగ్రెస్ 6 స్థానాలతో కలసి మొత్తం 48 సీట్లతో ఎన్‌సీ అధికారాన్ని చేజిక్కించుకుంది. హర్యానాలో కాషాయం జెండా ఎగిరినా, జమ్ముకశ్మీర్‌లో మాత్రం మోడీ అజెండా ఆశించిన స్థాయిలో ఫలించలేదు. అయితే, గతంలో కంటే ఇక్కడ తాము మరింత బలోపేతమయ్యామంటూ కమలనాథులు గొప్పగా చెప్పుకుంటున్నారు.**

ఎన్నికల క్షేత్రంలో ఎవరు గెలుస్తారో, ఎవరు ఓడిపోతారో ఊహించలేం. తప్పకుండా గెలుస్తారనుకున్నవారు ఓడిపోవచ్చు. ఓడిపోతారనుకున్న వారు గెలవవచ్చు. గొప్పగొప్ప రాజకీయపండితుల ఊహలు కూడా ఒక్కోసారి తారుమారవుతాయని, ఎగ్జిట్‌పోల్స్ అంచనాలు కూడా తలకిందులౌతాయని చెప్పేందుకు తాజాగా హర్యానా, జమ్ముకశ్మీర్‌లో జరిగిన ఎన్నికలు ఒక పెద్ద ఉదాహరణ. హర్యానాలో కాంగ్రెస్‌కు విజయం ఖాయమని అందరూ అనుకున్నా, అక్కడ బీజేపీ విజయం సాధించింది. జమ్ముకశ్మీర్‌లో గెలుస్తామనుకున్న బీజేపీ ఓడిపోయింది. రెండు రాష్ట్రాల్లోనూ ప్రజలు తమకు నచ్చిన పార్టీలకే ఓట్లేసి స్పష్టమైన ఆధిక్యాన్ని కూడా ఇచ్చారు. హర్యానాలో ముచ్చటగా మూడోసారి బీజేపీ హ్యాట్రిక్ విజయం సాధిస్తుందని ఎవరూ ఊహించలేదు. కాంగ్రెస్ ఇక్కడ గెలిచి తీరుతుందనే ప్రచారమే బాగా జరిగింది. కాంగ్రెస్ నేతలు కూడా ఆ మాయలో పడి, ఎటూ గెలుస్తాం కనుక, ముఖ్యమంత్రిగా ఎవరిని చేయాలని కూడా ముందస్తుగానే నిర్ణయించుకున్నారు. కానీ, తామొకటి తలిస్తే, ప్రజలు మరొకటి తలుస్తారన్నట్లుగా, ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ చతికిలపడింది. హర్యానాలో రైతుల నిరసనలు,

10లో



## పంట కాలువలకు విముక్తి కలిగేలా...

# దురాక్రమణలను తొలగిస్తాం!

### - మంత్రి నారాయణ హామీ



నెల్లూరు నగరాభివృద్ధికి ప్రతిబంధకంగా ఉన్న అక్రమ కట్టడాలను, రాజకీయాలకు పార్టీలకు అతీతంగా ఆక్రమణలను తొలగించడం జరుగుతుందని రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ స్పష్టం చేశారు. ప్రజల సమస్యలు తీర్చడమే తమ లక్ష్యమన్నారు. ఈనెల 5న ఆయన నెల్లూరులోని 16, 50 డివిజన్లలో పర్యటించి ప్రధాన కాలువలను పరిశీలించారు. ఆక్రమణలకు గురైన పంటకాలువలన్నిటికీ ఆక్రమణల నుంచి త్వరలోనే విముక్తి కలిగిస్తామన్నారు. ఆ కాలువలను ఆక్రమించుకుని అక్రమకట్టడాలను నిర్మించుకుని ఉన్నవారు వెంటనే వారికివారే వాటిని ఖాళీచేయాలని, అది టీడీపీ వారైనా సరే అక్రమ కట్టడాలు కట్టివుంటే వాటిని కూడా తొలగించి తీరుతామని చెప్పారు. కాలువ గట్ల మీద నివసిస్తున్న నిరుపేదలకు ప్రత్యామ్నాయం చూపిస్తామని హామీ ఇచ్చారు. నగరంలోని పార్కులను కూడా అందంగా, ప్రజలకు సౌకర్యయుతంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

### బోడిగాడితోటలో విద్యుత్ సబ్‌స్టేషన్...



నెల్లూరులోని 5వ డివిజన్‌లో ఉన్న బోడిగాడితోటలో 3.6 కోట్ల రూపాయల వ్యయంతో విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటైంది. ఈనెల 5న రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి నారాయణ దానికి ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ సబ్‌స్టేషన్ వల్ల పరిసరప్రాంతాల్లోని సుమారు 6వేల ఇళ్లకు, ఇతరత్రా వ్యాపార సముదాయాలకు లోటు లేకుండా విద్యుత్ పంపిణీ జరుగుతుందని చెప్పారు. డెప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, మామిడాల మధు, కార్పొరేషన్ కమిషనర్ సూర్యతేజ, నారాయణ విద్యాసంస్థల ఏజీఎం భాస్కర్‌రెడ్డి, విద్యుత్‌శాఖ ఎస్ఇ విజయన్, నగర ఇఇ శ్రీధర్, స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



## జ్వాలాముఖి అమ్మవారి ఆలయానికి త్వరలోనే మహర్దశ

**• హామీ ఇచ్చిన సోమిరెడ్డి**

జిల్లాలోని ప్రసిద్ధ పుణ్య క్షేత్రం.. తోటపల్లి గూడూరు మండలం వరిగొండలో వెలసివున్న చల్లనితల్లి, ఆరోగ్యప్రదాయిని, మహాశక్తి స్వరూపిణి శ్రీ జ్వాలాముఖి అమ్మవారి ఆలయానికి త్వరలోనే మహర్దశ రానుంది. ఆలయ పరిసరాలు పూలమొక్కలతో కళకళలాడేలా చేస్తామని, ఇతర మౌలికసదుపాయాలు కూడా కల్పిస్తామని మాజీమంత్రి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఈనెల 5న ఆయన వరిగొండ జ్వాలాముఖి అమ్మవారి ఆలయాన్ని సందర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆలయాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేస్తామన్నారు. ఈ ప్రాంత ప్రజలు ఆలయం వద్ద కల్యాణాలు జరుపుకునేందుకు దాతల సహకారంతో కల్యాణ మండపాన్ని కూడా ఏర్పాటుచేస్తామన్నారు. తొలుత, అమ్మవారికి ఆయన పట్టువస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, నిర్వాహకులు సోమిరెడ్డిని పూర్ణకుంభంతో స్వాగతించారు. అమ్మవారి వద్ద పూజలు చేయించి ఆశీర్వదించారు.

## రంగనాథస్వామికి రూ.17.21 లక్షల రాబడి



నెల్లూరులోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీదేవి భూదేవి సమేత శ్రీ తల్పగిరి రంగనాథస్వామి దేవాలయానికి భక్తుల సమర్పించిన కానుకల ద్వారా రూ.17,21,022 ఆదాయం వచ్చింది. ఈనెల 5న హుండీలు లెక్కించగా ఆలయానికి ఆమేరకు రాబడి వచ్చినట్లు ఇఓ ఆళ్ళ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. దేవాదాయశాఖ నెల్లూరు డివిజన్ ఇన్స్‌పెక్టర్ సుధీర్ పర్యవేక్షించగా, ఆలయ ఛైర్మెన్ మంచికంటి శ్రీనివాసులు, ధర్మకర్తలు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ వినియోగం హానికరం

### విఎస్‌యు వీసీ విజయభాస్కర్‌రావు




ప్లాస్టిక్ వినియోగం హానికరమని, ప్రజలు దానికి దూరంగా ఉండాలని విఎస్‌యు (విక్రమసింహపురి యూనివర్శిటీ) వైస్ ఛాన్సలర్ విజయభాస్కర్‌రావు చెప్పారు. ప్లాస్టిక్ వల్ల పర్యావరణానికి కలుగుతున్న ముప్పు గురించి ఆయన విద్యార్థులకు అవగాహన కలిగించారు. ప్లాస్టిక్ వినియోగంతో పెద్దఎత్తున కాలుష్యం ఏర్పడుతోందని, అదొక మహమ్మారిలా మారి పర్యావరణాన్ని దెబ్బతీస్తోందని అన్నారు. ప్లాస్టిక్ నియంత్రణకు అందరూ కృషిచేయాలని, దాని బదులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని ఆయన తెలిపారు. అనంతరం ప్లాస్టిక్‌కు బదులుగా స్టీల్ వాటరబాటిల్స్‌ను పంపిణీ చేశారు. విఎస్‌యు రిజిస్ట్రార్ డా. కె సునీత, కళాశాల ప్రిన్సిపాల్ సిహెచ్ విజయ, కావలి పీజీ సెంటర్ ప్రిన్సిపాల్ టి.వీరారెడ్డి, డా.ఎస్‌బి.సాయినాథ్, డా.జి.సుజయ్‌కుమార్ పాల్గొన్నారు.

## రైతుల సమస్యలను పట్టించుకోని ప్రభుత్వాలు

**• రైతు సంఘం ధ్వజం**



రైతుల సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏ మాత్రం పట్టించుకోవడం లేదని, పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేక రైతులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వాల్లో చలనం ఉండడం లేదని ఏపీ రైతు సంఘం జిల్లా శాఖ ఉపాధ్యక్షులు రావి మాల్యాద్రి ధ్వజమెత్తారు. ఈనెల 5న మండలకేంద్రమైన జలదంకిలో సీపీఎం కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, వ్యవసాయ ఖర్చులు పెరిగి రైతులు అప్పులపాలవుతున్నారని, దీంతో రైతుల కుటుంబాల పరిస్థితి దయనీయంగా మారిందని అన్నారు. జిల్లాలోని సోమశిల జలాశయంలో పుష్కలంగా నీళ్ళున్నా, కావలి కాలువ ఆయకట్టు రైతాంగానికి మాత్రం నీళ్ళందించడం లేదని, దీంతో పంటపొలాలే కాక, మూగజీవాలు కూడా నీళ్ళు లేక నానా యాతనలు పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా కావలి రైతుల కష్టాలు గమనించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో రైతుసంఘం నాయకులు ఆంథోనిబాబు, ప్రసాద్, తిరుపాలు పాల్గొన్నారు.

### సంతపేట ఆంజనేయస్వామి ఆలయం..

## ఇఓగా రఘురామయ్య



నెల్లూరులోని ప్రసిద్ధ దేవాలయాల్లో ఒకటైన సంతపేట శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానం కార్యనిర్వహణాధికారిగా పోట్ల రఘురామయ్య బాధ్యతలు చేపట్టారు. గుంటూరు జిల్లా కొండముడి దేవస్థానాల ఇఓగా పనిచేస్తున్న ఆయన ఇటీవల నెల్లూరుకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా స్థానిక శ్రీకృష్ణ చరిత మానస ప్రచారమండలి వారి ఆధ్వర్యంలో శ్రీ ఆంజనేయస్వామికి వడమాలలు సమర్పించి, నేత్రపర్వంగా పత్రపూజ నిర్వహించారు. పెద్దసంఖ్యలో పాల్గొన్న భక్తులకు అన్నప్రసాదాలు అందజేశారు.

## ఇనమడుగులో.. శ్రీ సత్యానందస్వామి ఆరాధన



కోవూరు మండలం ఇనమడుగులో ఉన్న శ్రీ సత్యానందాశ్రమంలో ఈనెల 6న శ్రీ సత్యానందస్వామి వారి 28వ ఆరాధనోత్సవాలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. ఆశ్రమ పీఠాధిపతి శ్రీ శ్రీహరి తీర్థస్వామి పర్యవేక్షణలో జరిగిన ఈ ఉత్సవాల్లో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి విగ్రహం వద్ద పూజలు చేశారు. ఆశ్రమంలో కొలువైవున్న శ్రీ తారకేశ్వరస్వామి మందిరంలో ప్రత్యేక పూజలు, మహన్యాస పూర్వక రుద్రాభిషేకం కన్నుల పండువగా నిర్వహించారు. శ్రీ స్వామివారి ఆరాధనకు జిల్లా నుంచే కాక ఇతర ప్రాంతాల నుంచి కూడా పలువురు ఆశ్రమ పీఠాధిపతులు, స్వామీజీలు వచ్చి ఆశ్రమాన్ని సందర్శించి, ఈ పూజల్లో పాల్గొన్నారు. ఆశ్రమ ఆస్థాన పండితులు చీమకుర్తి వెంకటేశ్వరరావు శ్రీ సత్యానంద మహర్షి బోధనలను, ఆయన రచించిన పలు గ్రంథాల సారాంశాన్ని వివరించారు. ఈ ఉత్సవాల్లో హరేరామ క్షేత్రం అధిపతి శ్రీ కృష్ణానందస్వామి, మాతా పరమేశ్వరి(తెలంగాణ), పురుషోత్తమ తీర్థస్వామి, సత్యానందాశ్రమ కార్యదర్శి పి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొని ఉపన్యసించారు. ఈ సందర్భంగా వేదపఠనం చేసిన పలువురు చిన్నారులకు శ్రీ శ్రీహరి తీర్థస్వామి బహుమతులిచ్చి అభినందించారు.

## 'వెలుగు' వీఓఏల సమస్యలు తీర్చండి



జిల్లాలో 'వెలుగు' పథకంలో పనిచేస్తున్న యానిమేటర్స్ (వీఓఏ) సమస్యలు తీర్చాలంటూ ఆశా వర్కర్స్, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్‌ల ఆధ్వర్యంలో ఈనెల 5న నెల్లూరులోని కలెక్టరేట్ వద్ద ధర్నాందోళన నిర్వహించారు. వీఓఏలకు గత నాలుగు నెలలుగా జీతభత్యాలు లేవని, వారికి పనిభద్రత కల్పించాలని యూనియన్ జిల్లా కార్యదర్శి దుగ్గిరాల అన్నపూర్ణమ్మ డిమాండ్ చేశారు. వీఓఏలను అక్రమంగా తొలగించడం మంచిపద్ధతి కాదన్నారు. ఆమేరకు వారు డిఆర్‌డిఎ లవన్నకు వినతిపత్రం అందజేశారు. యూనియన్ జిల్లా కార్యదర్శి రెహానాబేగం శాంతకుమారి, రాధ, రాజా తదితరులు పాల్గొన్నారు.

### బాధ్యతలు చేపట్టిన

## డీఆర్డీఏ పీడీ



జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డిఆర్‌డిఏ) ప్రాజెక్టు డైరెక్టర్‌గా ఈనెల 5న నాగరాజకుమారి నెల్లూరు కలెక్టరేట్ ఆవరణంలోని కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. సిబ్బంది ఆమెను స్వాగతించి, శుభాకాంక్షలు చెప్పారు. అడిషనల్ పీడీ రాజు, డీపీఎంలు, ఏపీఎంలు పాల్గొన్నారు. గతంలో నాగరాజకుమారి జిల్లాలోని దివ్యాంగులశాఖలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా కూడా పనిచేసివున్నారు.

# శ్రీవారి సేవకులకు.. మనవారి సేవ

## 4 వేలమంది టీటీడీ ఉద్యోగులకు వేమిరెడ్డి దంపతుల వస్త్ర బహుకరణ



తిరుమలేశుని బ్రహ్మోత్సవాల సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానాల్లో పనిచేస్తున్న సిబ్బందికి ప్రతిఏటా వస్త్రాలు అందిస్తూ వస్తున్న నెల్లూరు ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి-ప్రశాంతిరెడ్డి దంపతులు ఈ ఏడాది కూడా తమ వితరణను కొనసాగించారు. కలియుగ ప్రత్యక్షదైవమైన తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి సేవలో పాల్గొంటున్న దాదాపు నాలుగు వేల మంది టీటీడీ ఉద్యోగులు, సిబ్బందికి ఈనెల 9వతేది బుధవారం నాడు వారు వస్త్ర బహుకరణ కార్యక్రమం చేపట్టారు. తిరుమల శ్రీవారి ఆలయంలోని రంగ నాయక మండపంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీ వేమిరెడ్డి దంపతులు, టీటీడీ ఇఓ శ్యామలరావు, జేఈఓ వెంకయ్య చౌదరి పాల్గొని తమ చేతులమీదుగా టీటీడీ సిబ్బందికి, అర్చకులు, లడ్డూ పోటు కార్మికులకు, కల్యాణకట్టలో విధులు నిర్వహించే సిబ్బందికి, ఇతర విభాగాల వారందరికీ నూతన వస్త్రాలను ఇచ్చి గౌరవించారు. తమ సేవలను గుర్తించి ఏటా వస్త్ర బహుకరణ నిర్వహిస్తున్న వేమిరెడ్డి దంపతులకు టీటీడీ ఉద్యోగులు, సిబ్బంది ప్రత్యేక ధన్యవాదాలు తెలియ జేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ.. గత 5 సంవత్సరాలుగా తాము శ్రీవారి సేవలో ఉంటున్న టీటీడీ ఉద్యోగులకు వస్త్ర బహుకరణ చేస్తున్నామని చెప్పారు. స్వామివారికి సేవలు చేసేవారికి సేవ చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. జేఈఓ వెంకయ్యచౌదరి మాట్లాడుతూ దాతృత్వానికి పేరెన్నికగన్న వేమిరెడ్డి దంపతులు గొప్ప మనసుతో శ్రీవారి సిబ్బందికి వస్త్ర బహుకరణ నిర్వహించడం హర్షదాయకమన్నారు. శ్రీవారి బ్రహ్మోత్స వాల పండుగ వాతావరణంలో ఈ బృహత్తర కార్యక్రమాన్ని నిర్వహించడాన్ని విపిఆర్ దంపతులు ఆనవాయితీగా పెట్టుకోవడం మంచి సంప్రదాయమని ఆయన కొనియాడారు.

# టిడ్కో ఇళ్లకు..త్వరలోనే మంచిరోజులు!

- అజయ్ రాకతో లబ్దిదారుల్లో ఆనందం



రాష్ట్ర టిడ్కో చైర్మెన్‌గా జనసేన నాయకుడు, మన నెల్లూరీయుడైన వేములపాటి అజయ్‌కుమార్ నియమితులు కావడంతో రాష్ట్రవ్యాప్తంగా టిడ్కో ఇళ్లకు ఇక త్వరలోనే మంచిరోజులు రానున్నాయి. ఆ ఇళ్ళను టీడీపీ హయాంలో కట్టించడంతో, గత వైకాపా పాలనలో కక్షగట్టి వాటిని అస్తవ్యస్తం చేసేశారు. ఆ ఇళ్లకు ఎలాంటి వసతులు రాకుండా పాడుబెట్టించారు. దీంతో టిడ్కో ఇళ్ళలో చేరాలన్నా ప్రజలకు భయంగా ఉండేది. ఎలాంటి సౌకర్యాలు లేక, చాలా ఇళ్ళలో ఎవరూ ఉండకపోవడంతో, ఆ ఇళ్ళన్నీ చాలావరకు ఖాళీగానే ఉంటున్నాయి. పేదలకు కేటాయించిన ఆ ఇళ్లను గత ప్రభుత్వం పూర్తిస్థాయిలో నిర్లక్ష్యం చేయడంతో ఎంతోకాలంగా అవి అతీగతీ లేకుండాపోయాయి. అయితే, కొత్తప్రభుత్వం రావడం, నిబద్దత కలిగిన.. ప్రజల సమస్యలపై అవగాహన ఉన్న అజయ్ టిడ్కో ఛైర్మెన్ కావడంతో, ఆ ఇళ్లకు ఇక త్వరలోనే మహర్దశ వస్తుందని లబ్దిదారులు భావిస్తున్నారు. అందుకు తగ్గట్టుగానే ఆయన టిడ్కో ఇళ్ళ స్థితిగతులను పరిశీలిస్తూ, వాటిలో అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించి లబ్ధిదారులకు కేటాయించేందుకు చర్యలు ప్రారంభించారు. టిడ్కో ఛైర్మెన్ అయ్యాక ఆయన తొలి సారిగా ఈనెల 8న నెల్లూరుకు వచ్చినప్పుడు సమీపంలోని అల్లీపురంలో ఉన్న టిడ్కో ఇళ్ళ సముదాయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన్ను చూసి ప్రజలు సంతోషించారు. ఇంతకాలంగా ఆ ఇళ్ళలో ఉన్న సమస్యలన్నిటినీ ఆయన వద్ద మొరపెట్టుకున్నారు. తాగేందుకు మంచినీళ్ళు కానీ, ఉండేందుకు సరైన సౌకర్యాలు కానీ ఇక్కడ లేవని, వీధి లైట్లు కూడా వెలగకపోవడంతో రాత్రివేళల్లో భయంగా ఉంటోందని స్థానికులు ఆయన వద్ద వాపోయారు. పెద్దగా జనం ఇక్కడ లేకపోవడంతో మందుబాబుల ఆగడాలు పెరిగిపోయాయని, ఎప్పుడు ఏం జరుగుతుందోననే ఆందోళనతో ఉన్నామని తెలిపారు. వాళ్ళు చెప్పిన విషయాలన్నిటినీ అజయ్ శ్రద్ధగా విన్నారు. సమస్యలను అధికారులతో చర్చిస్తానని, త్వరలోనే వారి కష్టాలు తీర్చి, టిడ్కో ఇళ్ళను సౌకర్యయుతంగా తీర్చిదిద్దడం జరుగుతుందని, లబ్దిదారులందరికీ త్వరలోనే మంచి వసతులతో ఇళ్లను కేటాయిస్తామని అజయ్ వారికి భరోసా కలిగించారు. ఈ పరిశీలనలో ఆయన వెంట నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ శర్మ, టిడ్కో ఇఇ ఉమాశంకర్‌శాస్త్రి, జనసేన నాయకులు నూనె మల్లికార్జునయాదవ్, దుగ్గిశెట్టి సుజయ్‌బాబు, గునుకుల కిషోర్, షేక్ ఆలియా తదితరులున్నారు.




లాయర్
అక్టోబర్ 11, 2024

# అదుపులేని పేదరికం.. కష్టాలకి కారకం!

పెరుగుతున్న జనాభా, పెరుగుతున్న నిరుద్యోగం, పెరుగుతున్న అసమానతలు, పెరుగుతున్న ప్రకృతి విపత్తులు, పెరుగుతున్న ధరలు..ఇలా అన్నీ భారీగా పెరిగిపోతుంటే, తానేమీ తక్కువ తినలేదన్నట్లుగా పేదరికం కూడా ఇక 'తగ్గేదేలే' అంటూ పెరిగిపోతూనే ఉంది. దేశంలో ఒకవైపు ఆర్థిక పురోగతి కనిపిస్తున్నా, ఆర్థిక అసమానతలు కూడా మరోవైపు వెక్కిరిస్తున్నాయి. ఇది ఒక్క మనదేశంలోనే కాదు, ప్రపంచంలో అనేక దేశాల దుస్థితి ఇలాగే ఉంది. ఎన్ని ప్రయత్నాలు చేసినా పేదరికం అనేది ఎవరూ తీర్చలేని జటిల సమస్యగా తయారవుతూనే ఉంది. తాజా గణాంకాల ప్రకారం ప్రపంచంలో 20223లో దాదాపు 712 మిలియన్ల మంది ప్రజలు చాలా స్వల్ప ఆదాయంతోనే బతుకులీడుస్తున్నారు. అత్యంత పేదరికంతో జీవిస్తున్న కార్మికుల సంఖ్య కూడా గతంలో కంటే భారీగా పెరిగిపోతూనే ఉంది. అందుకే, 1992లోనే ఐక్యరాజ్య సమితి అక్టోబరు 17ను 'అంతర్జాతీయ పేదరిక నిర్మూలన దినోత్సవం'గా పరిగణిస్తూ, పేదరికంపై పోరాడేందుకు అన్ని దేశాలు సమాయత్తం కావాలని పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో పేదరికం నిర్మూలనకు అన్ని దేశాల్లో ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. మనదేశం కూడా ఆ దిశలో అడుగులు వేస్తోంది కానీ పేదరికాన్ని పూర్తిస్థాయిలో అధిగమించలేకపోతోంది. అందుకు కారణాలను మన ప్రభుత్వాలు మరింత లోతుగా అన్వేషించాలి. కరోనా మహమ్మారిని తట్టుకుని నిలబడి, ఇప్పుడిప్పుడే దేశం ఆర్థిక, సాంకేతిక అంశాల్లో గతంలో కంటే ఎక్కువగా వృద్ధిని సాధిస్తూనే ఉండడం సంతోషకరం. అయితే, ప్రజల జీవనప్రమాణాల దృష్ట్యా ఇంకా దేశం పేదరికంలోనే ఉంది. దారిద్ర్యపు రేఖకు దిగువన ఉన్నవారు అటు పట్టణాల్లోను, ఇటు గ్రామీణప్రాంతాల్లోనూ గణనీయంగానే ఉన్నారు. ప్రపంచంలోనే అయిదో పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఆవిర్భవించినా, దేశంలోని పేదలు, మధ్యతరగతి ప్రజల అవస్థల్లో మాత్రం ఎలాంటి మార్పులు ఉండడం లేదు. ఆర్థిక అసమానతలను తగ్గించేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సరైన చర్యలు తీసుకోకపోవడం వల్లనే ఈ దుస్థితికి కారణమనే విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. ఉపాధి కల్పించలేని అభివృద్ధి వల్ల పేదలు, నిరుపేదలకు ప్రయోజనం ఏమిటన్నది కూడా ప్రజలను కలవరపరుస్తోంది. జనాభాతో పాటు అనేక రకాల ఆర్థిక, సామాజిక సమస్యలు పెరిగి పేదరికం నానాటికీ పెనుభూతంగా మారుతోంది. అదే ఒక పెద్ద శాపంగా పరిణమిస్తోంది. ఇది ఇప్పట్లో వదిలేలా కనిపించడం లేదు. ఇప్పటికీ కేంద్రప్రభుత్వ సంస్థల్లో లక్షలాది ఉద్యోగాలు ఖాళీగానే ఉంటున్నాయి తప్ప వాటి భర్తీకి చర్యలు ఉండడం లేదు. ఫలితంగా ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువత పరిస్థితి వేదనాభరితంగా ఉంటోంది. దీంతో పేదరికం కూడా జత కలుస్తోంది. ఇకనైనా ఖాళీగా ఉన్నవాటిని భర్తీ చేయడమే కాక, కొత్త ఉద్యోగాలను సృష్టించాలి. ప్రజలకు ఉపాధి అవకాశాలను భారీస్థాయిలో పెంపొందించాలి. ఇప్పటికే పల్లెలు, పట్టణాలు, నగరాల్లో ఎక్కడ చూసినా పేదలు జీవనాధారం దొరక్క అల్లాడిపోతున్నారు. కార్మికులు, కష్టజీవుల బతుకుతెరువుకు అన్నీ బాధలే. తినడానికి తిండి లేక, ఉండడానికి ఇల్లులేక నిత్యం సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నవారు దేశంలో కోట్లాదిమంది ఉన్నారని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. సరైన పోషకాహారం కూడా లేక ఎంతో మంది చిన్నారులు బక్కచిక్కిపోయి నానా రకాల వ్యాధులతో బాధలు పడుతున్నారు. ప్రభుత్వాలు పేదల కోసం అనేక రకాల పథకాలు అందిస్తున్నా అవి పూర్తిస్థాయిలో పేదలకు చేరడం లేదు. పేదలకు పని కల్పించడానికని ఉపాధి హామీ పథకం ఉన్నా, అది కూడా అక్రమార్కుల చేతుల్లో పడి హారతి కర్పూరమైపోతోంది. సరైన పర్యవేక్షణ లేకపోవడంతో అవినీతి జలగలు అందినంత కాజేస్తున్నారే తప్ప, నిరుపేదలకు అది కూడా సక్రమంగా అందడం లేదు. ఇదొక ఉదాహరణ మాత్రమే. ఇకనైనా ప్రభుత్వాలు మేలుకొని అన్నిరంగాల్లోని అవినీతి భరతం పట్టాలి. పేదరికం నిర్మూలనకు శ్రద్ధ తీసుకోవాలి. కేవలం మాటలతో పేదరికం పొమ్మంటే పోదు.. పటిష్టమైన విధానాలు, ముందుచూపుతో ప్రణాళికలు ముఖ్యం. అయితే, ఒక్క ప్రభుత్వాల చర్యలతోనే పేదరికం సమసిపోదు. పేదరికాన్ని నివారించేందుకు అందరూ సంకల్పించాలి. వ్యవసాయ, పారిశ్రామిక రంగాల్లో ఉపాధి అవకాశాలను పెంపొందించుకోవాలి. కలసికట్టుగా కృషి చేస్తే ఎలాంటి సమస్యలనైనా అధిగమించవచ్చు. మేధావులు, నిపుణులు, ప్రజలు అంతా కలసి పేదరికంపై పోరాడాలి. ప్రభుత్వాలు అందుకు చేయూతగా మరిన్ని ఆర్థిక, సామాజిక సంస్కరణలతో ముందుకు రావాలి. అప్పుడే పేదరికం నివారణకు మరో ముందడుగు వేసినట్లవుతుంది.

## నిజంగా తప్పు జరిగుంటే.. ఆ పాపం అధికారులదే!

ఈ-మెయిల్
ప్రజావాణి
lawyerpatrika@gmail.com
WhatsApp +91 98663 14741

నెయ్యి విషయంలో జరుగుతున్న రాద్ధాంతం చూస్తుంటే విడ్డూరంగా ఉంది. నిజంగా నెయ్యిలో కల్తీ జరిగి వుంటే ఆ తప్పు ఖచ్చితంగా టీటీడీ అధికారులదే అన్నది నా అభిప్రాయం. కల్తీని గుర్తించ వలసిన నైతిక బాధ్యత అధికారులదే కదా..! ఒకవేళ గతంలోనే కల్తీని గుర్తించి ఆ నెయ్యిని వెనక్కి పంపివుంటే ఇక ఆ నెయ్యితో లడ్డూ తయారు చేసే అవకాశమే లేదు. టీటీడీపై ఎప్పుడైనా ఇలాంటి ఆరోపణలు వస్తే.. ముందుగా తిరుమలలో జరిగే కార్యకలాపాలపైన విచారణ జరిపించాలి. బాధ్యులైన వారిపై గట్టిచర్యలు తీసుకోవాలి. అంతవరకూ ఆలయ పవిత్రత పరిరక్షణ కోసం విషయ గోప్యత పాటించాలి.

అంతేగానీ, అసలు ఏ విచారణా జరగకముందే ఒక్కొక్కరూ ఒక్కొక్క మాట మాట్లాడుతూ ఏదో జరిగిపోయిందనే భావన ప్రపంచమంతా ప్రచారంచేసి, తమ రాజకీయ లబ్ధి కోసం భగవంతుడిని కూడా వాడుకోవాలని చూడటం క్షమార్హం కాదు. ముందుగా ఇతరులపై బురద జల్లడం, ఆ తరువాత పరస్పర ఆరోపణలు చేసుకోవడం, తమకి అవసరమైన స్థాయిలో ప్రచారం వచ్చాక ఆ అంశాన్ని పక్కన పెట్టడం రాజకీయ నేతలకి రివాజు. భగవంతుడిపై విశ్వాసానికి, నమ్మకానికి సంబంధించిన విషయంలో కూడా ఇలాగే వ్యహరిస్తే తప్పేంటని వారనుకొంటే సభ్య సమాజం క్షమించదు. ఆ పని ఎవరు చేసినా నేరమే...!

యం. విజయలక్ష్మి,
మాజీ న్యాయమూర్తి, హైదరాబాదు.

## 'రెడ్‌బుక్' - 'రెడ్డిబుక్' లాంటివి మంచి సంప్రదాయం కాదు!

చినబాబు చేతిలో 'రెడ్‌బుక్ కి తోడుగా రెడ్డిబుక్' అంటూ ఇటీవల మన 'లాయర్'లో రాసిన వార్త ముమ్మాటికీ నిజమే. కానీ అధికార పార్టీ అలా వ్యవహరించడం మంచి సంప్రదాయం కాదు. ప్రభుత్వ అధికారులు ఏ పార్టీ అధికారంలో ఉంటే వారికి ప్రాముఖ్యత ఇస్తారు. వారి ఆదేశాలని గుడ్డిగా పాటిస్తారు. వారిలో ఏ కొద్దిమందో మాత్రం అత్యుత్సాహంతో కులాభిమానం చూపిస్తారు. నిబంధనలకు విరుద్ధంగా కూడా వ్యవహరిస్తారు. కానీ, కొత్తగా వచ్చిన ప్రభుత్వాలు గాడిదని గుర్రాన్ని ఒకే గాటికి కట్టేయడం సమంజసం కాదు. ఎవరో కొందరు కులానికి కొమ్ము కాశారని ఆ కులానికి చెందిన అధికారులందరిని పక్కనపెట్టడం అర్ధరహితం, మూర్ఖత్వం. నేను 37 సంవత్సరాలు ప్రభుత్వ ఉద్యోగిగా ఉమ్మడి రాష్ట్రంలో అనేక ప్రాంతాలలో వివిధ హోదాలలో పనిచేశాను. పదేళ్ళక్రితం పదవీవిరమణ పొందాను. మా హయాంలో ఇలాంటి సంస్కృతి, సంప్రదాయం అస్సలు ఉండేది కాదు. కులం కొలమానం కాకుండా, అధికారుల పని తీరు ప్రామాణికంగా ఉండేలా కూటమి ప్రభుత్వం భవిష్యత్ నియామకాలు చేపట్టాలి. తమ స్వార్ధ రాజకీయాలకోసం ప్రభుత్వ ఉద్యోగులని శంకించి బలి చేయడం అనాలోచితం!

పీ. వీ. నారాయణరెడ్డి, విశ్రాంత ఇంజనీర్, నెల్లూరు.




## పొట్టకూటి కోసం పట్టణ బాట పడుతున్న పల్లెటూళ్ళు!

*"పల్లెటూరు మన భాగ్యసీమరా*
*పాడిపంటలకు లోటులేదురా*
*మంచితనం, మమకారం*
*మనిషి మనిషిలో కనపడురా..."*

అయిదు దశాబ్దాలకి ముందు "ఇల్లు ఇల్లాలు" సినిమా కోసం కవి కొసరాజు రాసిన పాట ఇది. అది ఆనాటి గ్రామసీమల ముఖచిత్రం. కానీ, నేటి పల్లెల పరిస్థితి అలా లేదు.

చుట్టూ పచ్చని పంటపొలాలకి, జలజలపారే సెలయేళ్ళకి, ఆహ్లాదకరమైన పరిసరాలకి ఆనవాళ్లు మన పల్లెటూళ్ళు. అనాదిగా పాటిస్తూ వస్తున్న ఆచారాలు, సత్ సంప్రదాయాలు, వీటన్నిటితో పాటు మంచీమర్యాదలకి నిలయాలు మన గ్రామసీమలు. 'అమ్మ' ప్రేమలా, నాన్న అనురాగంలా, స్వచ్ఛంగా, నిరాడంబరంగా, నిగర్వంగా, కల్మషం అన్న పదానికి అర్థమే తెలియని మంచివాళ్ళు మన పల్లెటూరోళ్ళు.

అక్కడ పాడిపంటలు పుష్కలంగా ఉంటాయి కనుక పనులకు లోటుండదు, అన్నానికి కరువుండదు. అందుకే, గ్రామాలు సంతోషంగా ఉంటే దేశం కూడా సుభిక్షంగా ఉంటుందని, 'గ్రామ స్వరాజ్యమే దేశ సౌభాగ్యమనీ' గాంధీజీ ఏనాడో చెప్పారు.

అయితే, రానురాను ఇవన్నీ జ్ఞాపకాలై గతంగా మిగిలిపోతున్నాయి.

ప్రగతికి ప్రతీకగా ఉండాల్సిన మన గ్రామాలు అధోగతికి చిరునామాలుగా మారిపోతున్నాయి. ఒక్కొక్కటిగా అనేక గ్రామాలు ఖాళీ అవుతున్నాయి.

గ్రామ జీవితాలు దుర్భరం అనే భావనతో పల్లెవాసులు పట్నవాసంపై మొగ్గుచూపుతున్నారు. పొట్ట చేతపట్టుకుని బతుకు బాట వెతుక్కుంటూ నగర బాట పడుతున్నారు.

గ్రామాల్లో సమస్యలు పెరిగిపోతున్నాయి.

పంటలు సరిగా పండడంలేదు.

పండిన పంటకి గిట్టుబాటు ధర లేదు.

యువతకు సరైన ఉపాధి దొరకడంలేదు.

మరోవైపు రాజకీయాలు-కక్షలు కార్పణ్యాలతో గ్రామాలు రావణకాష్టాలుగా మారుతున్నాయి.

ఇటువంటి అనేక కారణాలు.. పల్లె జనం నగరాలవైపు చూసేలా చేస్తున్నాయి. కొద్దోగొప్పో పొలం వున్న రైతన్నలు కూడా ఆ కొద్దీ స్థలమో పొలమో అమ్మేసుకుని ఊరు వదిలి వెళ్లిపోతున్నారు.

ఒకప్పుడు, కళకళలాడిన గ్రామాలు ఇప్పుడు వెలవెలబోతున్నాయి.

ఇది ఏ ఒక్క రాష్ట్రంలోనో కాదు, దేశమంతా ఇదే దుస్థితి.

### ప్రగతి శూన్యమైన పల్లెలు :

మనదేశంలో గ్రామీణవ్యవస్థ ఎప్పుడో చితికిపోయింది. 'గ్రామీణాభివృద్ధి' అన్నది నేతల మాటల్లో తప్ప, ఆచరణలో కనపడడం లేదు. అందుకు ప్రధాన కారణం నేతల నిర్లక్ష్యమే. అత్యాధునిక యుగంలో కూడా అనేక గ్రామాల్లో సరైన మౌలిక సదుపాయాలు లేవు. రైతులు కూలీలుగా మారిపోతున్నారు. కూలీలు పనులు దొరక్క ఇతర ప్రాంతాలకు వలసపోతున్నారు. అప్పుల బాధలతో, కుటుంబాలను పోషించుకోలేని దయనీయస్థితిలో చాలామంది మధ్యతరగతి రైతులు ఊళ్ళను వదిలేస్తున్నారు. పనులు దొరకని రైతు కూలీలు కూడా నగరాలకి చేరుకొని భవన నిర్మాణ కార్మికులుగా మారిపోతున్నారు. పెరిగిపోతున్న పేదరికం, నిరుద్యోగం రెండూ పల్లెప్రజలను కూడా బాగా వేపుకుతింటున్నాయి. నేటి ఆధునిక విజ్ఞానానికి తగ్గట్టుగా సాంకేతిక నైపుణ్య విద్య గ్రామాల్లో అసలే లేదు. మంచి చదువులు లేకుంటే మంచి ఉద్యోగం ఎలా దొరుకుతుంది?.. పల్లెల్లో బడి చదువులు తప్ప ఉన్నత విద్యలు అందుబాటులో లేకపోవడంతో పిల్లల చదువుల కోసం వారి తల్లితండ్రులు కూడా ఇతరప్రాంతాలకు వెళ్ళక తప్పడం లేదు.

### పట్టణాల వైపు.. పల్లెజనం చూపు :

తరతరాలుగా పల్లెలను అంటిపెట్టుకుని ఉన్నా ఒరిగిందేమీ లేదనే నిరాశ ఇప్పుడు పల్లెజనాన్ని ఆవరిస్తోంది. అదే కారణంతో, గత కొంతకాలంగా అధికశాతం పల్లెజనం పట్టణాలవైపు చూస్తున్నారు. దీంతో, గత పన్నెండేళ్లలో దేశవ్యాప్తంగా పల్లె జనాభా 4.1శాతం వరకు తగ్గిపోయిందని అధికారిక లెక్కలే చెప్తున్నాయి. 2011లో దేశంలో 68.9శాతం మంది పల్లెవాసులు ఉంటే, 2023 నాటికి ఆ సంఖ్య 64.8 శాతానికి తగ్గడం చూస్తే, వలసలు ఎంత ఆందోళనకరంగా సాగిపోతున్నాయో అర్థం చేసుకోవచ్చు. ఒక్క కేరళలోనే సుమారు 28.3 శాతం తగ్గుదల ఉంది, ఆంధ్రప్రదేశ్‌లో మొత్తంగా 7.1 శాతం దాకా పల్లెజనం తగ్గిపోయారు. 2011లో ఆంధ్రలో ఉన్న 4.95 కోట్ల జనాభాలో 3.47కోట్ల మంది పల్లెజనం ఉండేవారు. 2023 నాటికి మొత్తం జనాభా 5.32 కోట్లకు పెరిగినా, అందులో గ్రామీణ జనాభా సంఖ్య 3.37కోట్లకి తగ్గిపోయిందంటే అన్నపూర్ణ వంటి మన రాష్ట్రంలో కూడా వలసలు ఎంతటి స్థాయిలో ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు.

### ఇకనైనా పల్లెల కష్టాలపై దృష్టిపెట్టాలి :

దేశంలో పల్లెలు నిరాశలో కూరుకుపోకముందే కేంద్రం, ఆయా రాష్ట్రాల్లో ఉన్న రాష్ట్ర ప్రభుత్వాలు మేలుకోవాలి. రాజకీయాలను పక్కకుపెట్టి, ముందు పల్లెజనం పడుతున్న కష్టాలపై దృష్టిపెట్టాలి. దేశానికి అన్నంపెట్టే రైతులుండేది పల్లెల్లోనే. రైతుల కష్టాలను తీర్చి, వారు గ్రామాల్లోనే హాయిగా జీవించేలా వారి జీవనప్రమాణాలను పెంచేందుకు ప్రణాళికలు రూపొందించాలి. పల్లెజనమంతా పట్టణాల్లోకి వచ్చేస్తే, పల్లెలు పాడుబడిపోవడంతో పాటు, పట్టణాలు నగరాల్లో కూడా ఊహించని కొత్త సమస్యలు వస్తాయి.

పల్లెలు ఖాళీ కాకుండా ఉండాలంటే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తమ బడ్జెట్‌లో అధికశాతం నిధులు గ్రామీణ వికాసం కోసం ప్రత్యేకంగా కేటాయించాలి. "పల్లెలు దేశ ప్రగతికి పట్టు కొమ్మలు" అన్న నానుడి నిజం చేసేలా పల్లెలని ప్రగతిపథం వైపు పరుగులు పెట్టించాలి. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా, యువతకి ఉపాధి కల్పించడమే ధ్యేయంగా పారిశ్రామిక రంగానికి తాయిలాలు ప్రకటించాలి. పల్లె ప్రాంతాలలో జీవించేవారి జీవితాలకి భద్రతతో పాటు భరోసా కల్పించాలి. పల్లెలలో నిజమైన వికాసం వచ్చినప్పుడే దేశం అన్నిరంగాలలో ప్రకాశిస్తుంది!

- రాజశ్రీ



# చంద్రబాబుతోనే 'స్వర్ణాంధ్ర' సాకారం

**ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి**

ప్రధాని నరేంద్ర మోడీ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుల విజన్ దేశాన్ని, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్తుందని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి చెప్పారు. స్వర్ణాంధ్ర-2047 సాకారం చంద్రబాబుతోనే సాధ్యమని ఆయనన్నారు. నెల్లూరులోని కస్తూర్బా కళాక్షేత్రంలో ఇటీవల జిల్లా కలెక్టర్ ఆనంద్ అధ్యక్షతన నిర్వహించిన 'స్వర్ణాంధ్ర-2047 విజన్ వర్క్‌షాప్'లో ఎంపీ పాల్గొని ప్రసంగించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆలోచనలకు ప్రతిరూపమే స్వర్ణాంధ్ర-2047 మిషన్ అని, దేశంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చేపట్టిన వికసిత్ భారత్-2047లో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు స్వర్ణాంధ్ర-2047 మిషన్‌కు రూపకల్పన చేశారన్నారు. 2047వ సంవత్సరానికి మనకు స్వాతంత్ర్యం వచ్చి నూరు సంవత్సరాలవుతుందని, అప్పటికి మన దేశం, రాష్ట్రం సంపూర్ణ అభివృద్ధిని సాధించే లక్ష్యంతో వారు కృషిచేస్తున్నారని ఆయన తెలిపారు. జిల్లాలో స్వర్ణాంధ్ర 2047 విజన్ డాక్యుమెంటరీని ప్రజాప్రతినిధులు, ప్రజలు సహకారంతో తయారుచేయ డానికి చర్యలు తీసుకుంటామని ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన జిల్లా కలెక్టర్ ఆనంద్ చెప్పారు. స్వర్ణాంధ్ర 2047 విజన్‌లో ప్రజల సూచనలు సలహాలు తీసుకోవడానికి క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేయడం జరిగిందని, దానిని స్కాన్ చేసి సూచనలు సలహాలు పొందుపరచాలని ఆయన సూచించారు. జిల్లాలో స్వర్ణాంధ్ర 2047 విజన్ కొరకు అన్ని గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించడం జరిగిందని, జిల్లాలో ఇప్పటివరకు 50వేలమంది ప్రజలు క్యూఆర్ కోడ్ స్కాన్‌చేసి వివరాలను పొందుపరిచారని ఆయన తెలిపారు. జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ మాట్లాడుతూ, భారతదేశం సమగ్ర అభివృద్ధి సాధించి, 2047 నాటికి ప్రపంచంలోని మూడు అగ్రగామి ఆర్థికశక్తులలో ఒకటిగా నిలవాలని ఆకాంక్షించారు. ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ మాట్లాడుతూ, ఉదయగిరి నియోజకవర్గంలో దాదాపు 325 దేవాలయాలు ఉన్నాయని, అవన్నీ కూడా శిథిలావస్థకు చేరుకున్నాయని, ఆ దేవాలయాలను అభివృద్ధి చేసి టూరిజం ప్రాంతంగా తయారుచేయడానికి ప్రణాళిక తయారుచేయాలని కోరారు.

# నగరం బాగుకు నడుం బిగించిన మంత్రి నారాయణ



నెల్లూరు నగరాభివృద్ధికి మంత్రి నారాయణ నడుంబిగించారు. నగరాభివృద్ధే ధ్యేయంగా తాను కృషి చేస్తున్నానని, ఓ మాస్టర్ ప్లాన్ ప్రకారం, ప్రజలఆకాంక్షల మేరకు అన్నివిధాలా నగరాభివృద్ధి జరుగుతుందని స్పష్టం చేశారు. నెల్లూరునగర నియోజకవర్గ పరిధిలోని 3, 4, 5 డివిజన్‌లలో ఆయన ఇటీవల అధికారులు, స్థానిక నాయకులతో కలసి పర్యటించారు. అపరిశుభ్రంగా ఉన్న ప్రదేశాలను వెంటనే శుభ్రపరచాలని నగర పాలక సంస్థ అధికారులను ఆదేశించామన్నారు. ఖాళీ స్థలాల్లో వ్యర్థాలు, ముళ్ళచెట్లను తొలగించేలా చర్యలు చేపట్టాలని అధికారులకు తెలియజేశారు. దోమల వృద్ధికి మురుగు స్థలాలే ప్రధాన కారణమని, అలాంటి ప్రదేశాలను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా నెల్లూరు ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణాన్ని అందించే అవకాశం ఉంటుందని తెలిపారు. గత ప్రభుత్వంలో అవగాహన లేకుండా కాలువలు కట్టడం వల్ల అవి ఎందుకూ ఉపయోగపడని పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రణాళిక ప్రకారం డ్రెయిన్లు, రోడ్ల నిర్మాణం చేపడుతున్నామన్నారు. సింహపురి ప్రజలకు సుపరిపాలన అందిస్తూ, నెల్లూరును అన్ని విధాల ప్రగతిపథంలో పయనించేలా కృషిచేస్తామన్నారు.

## సమస్యలన్నీ పరిష్కరిస్తాం - మంత్రి హామీ

నెల్లూరు నగర నియోజకవర్గ పరిధిలో ఉన్న సమస్యలపై ప్రత్యేక దృష్టిసారించామని, త్వరలోనే సమస్యలన్నీ పరిష్కరిస్తామని రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి డా. నారాయణ చెప్పారు. ఇటీవల ఆయన నెల్లూరు కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనర్ సూర్యతేజతో కలసి అధికారులతో సమావేశం నిర్వహించారు. పలు సమస్యలు, అభివృద్ధి విషయాలపై వారితో చర్చించారు. అందరి సహకారంతో నెల్లూరును అన్ని విధాలా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనిచేయాలని ఆయన కార్పొరేషన్ అధికారులకు సూచించారు.

# మత్స్యసంపదను బాగా వినియోగించుకోండి

**- 'ఫుడ్ ఫెస్టివల్'లో కేంద్రమంత్రి శ్రీనివాసవర్మ**



రాష్ట్రవ్యాప్తంగా మత్స్యసంపద వినియోగాన్ని పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందని కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖల సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ పిలుపునిచ్చారు. ఇటీవల ఆయన నెల్లూరు విఆర్‌సి గ్రౌండ్‌లో ఏర్పాటుచేసిన 3వ రాష్ట్ర ఫుడ్‌ఫెస్టివల్‌కు ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, ఆహారపు అలవాట్లలో చేపలు, రొయ్యలు తదితర సముద్ర ఉత్పత్తులను ఉపయోగించాలని వైద్యులు సైతం సలహాలిస్తున్నారన్నారు. ముఖ్యంగా అల్జీమర్స్, పార్కిన్‌సన్స్ వంటి దీర్ఘకాల వ్యాధుల నివారణకు చేపలు దివ్యౌషధంగా పని చేస్తాయన్నారు. మత్స్య సంపద వినియోగాన్ని పెంచేందుకు ఇలాంటి ఫుడ్ ఫెస్టివల్స్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకాన్ని తీసుకువచ్చి, కోట్లాది రూపాయల నిధులను కేటాయించి మత్స్యకారుల ఆర్థిక అభివృద్ధికి కృషిచేయడం జరుగుతోందన్నారు. సముద్ర తీర ప్రాంతంలో తమిళనాడుకు చెందిన కడలూరు మత్స్యకారులు మరబోట్లు వినియోగించి మత్స్య సంపదను దోచుకుంటున్న విషయాన్ని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తన దృష్టికి తెచ్చారని, ఈ విషయాన్ని కేంద్రంలోని మంత్రుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ, ప్రపంచంలోనే నెల్లూరు చేపల పులుసుకు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. నెల్లూరు తీర ప్రాంతంలో మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలను కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. కడలూరు నుండి చేపల వేటకు నెల్లూరు ప్రాంతానికి వచ్చే మత్స్యకారులను నివారించేందుకు పెద్ద మరబోట్లు వినియోగించడం అవసరమని, ఈ విషయమై కేంద్ర ప్రభుత్వంతో చర్చించి తగిన విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన కేంద్రమంత్రిని కోరారు. కృష్ణపట్నం పోర్టుకు కంటైనర్లు ఆపడం వల్ల దాదాపు వెయ్యి కోట్లు ఆదాయం రాక ప్రభుత్వానికి నష్టం జరిగిందని, పదివేల మంది ఉద్యోగ అవకాశాలు కోల్పోయారని ఎమ్మెల్యే సోమిరెడ్డి మంత్రికి తెలిపారు. తమిళనాడు, కడలూరు నుండి మత్స్యకారులు వేటకు ఈ ప్రాంతానికి రావడం వల్ల మత్స్యకారుల మధ్య గొడవలు జరుగుతున్నాయన్నారు. ఇలాంటి పరిస్థితులు రాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. మాజీ ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి, బీజేపీ ప్రతినిధులు సురేష్‌రెడ్డి, వంశీధర్ రెడ్డి, డెప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# వైకాపా పాలనలో.. వందల కోట్ల ఇసుక దోచేశారు

**కాకాణే ప్రధాన కారకుడు! - ఎమ్మెల్యే సోమిరెడ్డి ధ్వజం**



వైకాపా పాలనలో సర్వేపల్లి నియోజకవర్గంలో పెద్దఎత్తున ఇసుక దోపిడీ జరిగిందని, ఆ దోపిడీదారులను వదిలిపెట్టే ప్రసక్తే లేదని, దోచిన సొత్తును రాబట్టే వరకు విశ్రమించేదే లేదని, వడ్డీతో సహా కట్టిస్తామని మాజీమంత్రి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. ఇసుక దోపిడీకి ప్రధాన సూత్రధారి మాజీమంత్రి కాకాణి గోవర్ధనరెడ్డేనని ఆరోపించారు. నెల్లూరులోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఇటీవల ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, ముఖ్యంగా, సూరాయపాళెం - విరువూరు రీచ్‌లలో రూ.91 కోట్ల వరకు ఇసుక దోపిడీ జరిగినట్టు తెలుస్తోందన్నారు. అయితే, ఇది పదోవంతు మాత్రమే నని, వైకాపా పాలన అయిదేళ్ళలో జరిగిన దోపిడీలపై సమగ్ర విచారణ జరిగితే ఇంకెన్ని కోట్లు తేలుతుందో చెప్పలేమని ఆయనన్నారు. సర్వేపల్లి నియోజకవర్గంలోని పెన్నాతీరాన ఉన్న సూరాయపాళెం, విరువూరు రీచ్‌లలో అక్రమ మైనింగ్ జరిగిందని అధికారులు నిర్ధారించారని, సూరాయపాళెంలో సర్వేచేసి రూ. 54.70 కోట్లు పెనాల్టీ విధించారని, అక్కడ సుమారు 2,73,500 టన్నుల ఇసుకను అక్రమంగా తవ్వి తరలించినట్లు తేల్చారని ఆయన చెప్పారు. అదేవిధంగా, విరువూరు రీచ్‌లోనూ లక్షా 85వేల టన్నుల ఇసుకను దోచేశారని, అధికారులు ఆ అక్రమాలను నిర్ధారించి రూ.37 కోట్లు జరిమానా కూడా విధించారన్నారు. అనుమతులు పొందిన చోట కాకుండా పరిధి దాటి వ్యవహరించి ఈ అక్రమాలకు పాల్పడ్డారన్నారు. 2019 నుంచి 2021 వరకు భారీగా అక్రమ మైనింగ్ జరిగినా దాని కొలతలు వేయకుండా, 2022లో వచ్చిన వరదల కారణంగా కొలతలు వేయలేకపోయామని అధికారులు తప్పించుకున్నారని ఆయన విమర్శించారు. వైకాపా అధికారంలోకి వచ్చిన రోజు నుంచే సూరాయపాళెం, విరువూరు రీచ్‌ల నుంచి వందల కోట్ల విలువైన ఇసుకను లేపేశారని, ఒక్క ఇసుకే కాదు గ్రావెల్, మట్టి, క్వార్జ్ దేనినీ వదిలిపెట్టకుండా దోచేశారని ఆయన మండిపడ్డారు.

## సర్వేపల్లిని నాశనం చేసేశారు :

రైతుల పొలాలు సారవంతం చేసేందుకు క్యూబిక్ మీటర్ మట్టిని ఒక్క రూపాయికే ఇవ్వాలని గతంలో టీడీపీ ప్రభుత్వం ఇచ్చిన జీఓను సైతం దుర్వినియోగం చేశారని, 5.75 లక్షల క్యూబిక్ మీటర్లకు రైతుల పేరుతో అనుమతులు పొంది సర్వేపల్లి రిజర్వాయర్, కనుపూరు చెరువులోని గ్రావెల్ మొత్తాన్ని ప్రైవేటు లేఅవుట్లకు అమ్ముకున్నారని ఆయన ఆరోపించారు. తానేమీ కాకాణిలా నోటికొచ్చినట్టు మాట్లాడడం లేదని, ప్రభుత్వ ఉత్తర్వులు, అధికారులు ఇచ్చిన రిపోర్టులు, షోకాజ్ నోటీసులు, సమాచార హక్కు చట్టం ద్వారా పొందిన సమాచారంతోనే మాట్లాడుతున్నానని ఆయన చెప్పారు. కాకాణి ఆదేశాలు లేకుండా సర్వేపల్లి రిజర్వాయర్, కనుపూరు చెరువులతో పాటు కసుమూరు, రామదాసుకండ్రిగ, ఈదగాలి నుంచి గ్రావెల్ ఎత్తే దమ్ము ఎవరికైనా ఉందా అని ఆయన అన్నారు. కాకాణికి సంబంధం లేకుండా వరదాపురం, మరుపూరు, మొగళ్లూరు, ముదిగేడు నుంచి క్వార్ట్జ్ కదలించగలరా? అని ఆయన ప్రశ్నించారు. మంత్రిగా కాకాణి ఉన్నప్పుడు గూడూరు నియోజకవర్గంలోని సిలికాను కూడా వదల్లేదని, వైకాపా పాలనలో సర్వేపల్లిని అన్నివిధాలా సర్వనాశనం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్రమాలకు పాల్పడే అలాంటి నాయకులు ఇప్పుడు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుపై, తనపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని దుయ్యబట్టారు.

# గాంధీజీ ఆశ్రమంలో.. సర్వమత ప్రార్థనలు

ఇందుకూరుపేట మండలం పల్లిపాడులో ఉన్న పినాకిని గాంధీజీ సత్యాగ్రహాశ్రమంలో ఈనెల 6న సర్వమత ప్రార్థనలు జరిగాయి. తొలుత, పల్లిపాడు డైట్ కళాశాల పూర్వ విద్యార్థులు, ప్రస్తుత అధ్యాపకులు పాల్గొని గాంధీజీ విగ్రహానికి, ఆశ్రమ స్థల దాత పొణకా కనకమ్మ విగ్రహానికి నూలుమాలలు సమర్పించి నివాళులర్పించారు. ఆశ్రమ కమిటీ సభ్యులు జి.మంజుల పాల్గొని విద్యార్థులకు బాపూజీ ఆదర్శాలను-జీవిత విశేషాలను వివరించారు. గ్రామ సర్పంచ్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# నెల్లూరు కబుర్లు

## ఇంటికి తాళం వేసి వెళ్తున్నారా?.. అయితే జాగ్రత్త!

### ఎల్ఎస్‌హెచ్ఎంను ఉపయోగించుకోవాలంటున్న జిల్లా ఎస్పీ



ఇళ్ళకి తాళం వేసి వెళ్లేవారు, ఆ ఇళ్ళలో ఎలాంటి దొంగతనాలు జరగకుండా ముందుజాగ్రత్తగా ఉండాలంటున్నారు జిల్లా ఎస్పీ కృష్ణకాంత్. చోరీల బారినపడకుండా రక్షణగా ఎల్‌హెచ్ఎంఎస్ (లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టం) సిద్ధంగా ఉందని, పోలీసులను సంప్రదించి ఆ సిస్టమ్‌పై అందరూ అవగాహన కలిగించుకోవాలన్నారు. యాప్ ద్వారా కానీ, లేదా నేరుగా కానీ 94407 96383 లేదా, 93929 03413 నంబర్లకు ఫోన్ చేస్తే ఆ ఇంట్లో దొంగతనాలు జరగకుండా పోలీసులు అప్రమత్తంగా ఉంటారని, పోలీసుల ఉచిత సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. డబ్బు, నగలు వగైరా విలువైన వస్తువులను ఇంట్లో ఉంచకుండా, బ్యాంకు లాకర్లలో భద్రపరచుకోవాలని సూచించారు.

## ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా.. మలిరెడ్డి శీనయ్య



ప్రముఖ న్యాయవాది, ఫుట్‌బాల్ క్రీడాకారుడు మలిరెడ్డి శ్రీనివాసులురెడ్డి జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈనెల 6న నెల్లూరు ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఆ సంఘానికి కొత్త కమిటీని ఎన్నుకున్నారు. మలిరెడ్డి శీనయ్యతో పాటు, కార్యదర్శిగా బి.చంద్రశేఖర్, కోశాధికారిగా బి.ఉమాశంకర్‌ను ఎన్నుకున్నారు. అదేవిధంగా, ఉపాధ్యక్షులుగా డి.అనిల్‌కుమార్, పీసీ జాకబ్, బాలప్రసాద్, కె.సత్యరాజ్, సంయుక్త కార్యదర్శులుగా ఆర్.కిరణ్‌కిషోర్, బి.రవీంద్రనాథ్, కె.శ్రీనివాసరావు, ఎం.కిరణ్‌కుమార్, మరో 9 మంది సభ్యులు ఎన్నికయ్యారు. జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారి ఆర్‌కె యతిరాజ్, రాష్ట్ర ఫుట్‌బాల్ అసోసియేషన్ కోశాధికారి విజయ్‌కుమార్, ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి కె.గురుప్రసాద్‌లు పర్యవేక్షించారు.

## 'విశ్వబ్రాహ్మణ విద్యానిధి' సమావేశం

నెల్లూరులోని శ్రీ సారంపాటి వీరన్నాచారి విశ్వబ్రాహ్మణ విద్యానిధి సంస్థ పాలకవర్గ సమావేశం ఈనెల 6వ తేదీన విద్యానిధి కార్యదర్శి పి.దయానంద నివాసంలో జరిగింది. సంస్థ అధ్యక్షుడు ఇనుకొండ చక్రపాణి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో, 2024-25 విద్యా సంవత్సరంలో నెల్లూరుజిల్లాలో ఇంటర్, డిగ్రీ, బీటెక్, ఎంసీఏ, ఎంఎ, బిఇడి చదువుతున్న పేద విశ్వబ్రాహ్మణ విద్యార్థినీ విద్యార్థులు 44మందికి ఉచిత వేతనంగా లక్షా రెండువేల రూపాయలు మంజూరు చేయడం జరిగిందని, పలువురు దాతలు విరాళాలు ఇచ్చారని విద్యానిధి నిర్వాహకులు తెలిపారు. కార్యవర్గ సభ్యులు కొండాచారి, పి.దయానంద, ఇనుకొండ చక్రపాణి, ఆలూరు కరుణాకర్, నారాయణరావు, శ్రీనివాసాచారి, పి.నాగేశ్వరరావు, టి.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# నగరానికి నవరాత్రుల శోభ

### ఆలయాలు కళకళ





దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా నెల్లూరు నగరంలోని అమ్మవారి ఆలయాలు దేదీప్యమానంగా వెలుగొందుతున్నాయి. విద్యుద్దీపకాంతులు, పూల అలంకారాలతో ప్రతి ఆలయం కళకళలాడుతోంది. ప్రధానంగా నెల్లూరు చెరువు గట్టున ఉన్న నెల్లూరు గ్రామదేవత శ్రీ ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి ఆలయం, దర్గామిట్టలోని శ్రీ రాజరాజేశ్వరిదేవి అమ్మవారి ఆలయం, మూలాపేటలోని శ్రీ భువనేశ్వరిదేవి సమేత మూలస్థానేశ్వరాలయం, రంగనాయకులపేటలోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీ రంగనాథస్వామి దేవాలయం వంటి ప్రముఖ దేవాలయాల్లో నిత్యపూజలు, సేవలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. దర్గామిట్ట సుజాతమ్మ కాలనీలోని శ్రీ అష్టలక్ష్మీదేవి మందిరంలో ప్రతిరోజూ విశేష పూజలు నిర్వహిస్తున్నారు. ఈ ఉత్సవాల్లో ప్రధానంగా ఈనెల 12న రానున్న 'విజయదశమి' పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ వేడుకలను మరింత పెద్దఎత్తున నిర్వహించేందుకు ఆలయాల అధికారులు, నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనెల 6న శ్రీ ఇరుకళల పరమేశ్వరి అమ్మవారికి భవాని అలంకారం, శ్రీ రాజరాజేశ్వరిదేవి అమ్మవారికి అన్నపూర్ణాదేవి అలంకారం నిర్వహించారు. అష్టలక్ష్మీదేవి ఆలయంలో అమ్మవారు శ్రీ మీనాక్షిదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. నిత్యం వేలాదిమంది భక్తుల రాకపోకలతో అమ్మవారి ఆలయాలు క్రిక్కిరిసిపోతున్నాయి.



## రంగనాథుని సేవలో..ఎన్నికల కమిషన్ అధికారి

నెల్లూరులోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీదేవి భూదేవి సమేత శ్రీ తల్పగిరి రంగనాథస్వామి వారి దేవస్థానాన్ని ఈనెల 6న రాష్ట్ర ఎన్నికల కమిషన్ జాయింట్ సెక్రటరీ జి.వి సాయిప్రసాద్ దంపతులు సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు ఆలయమర్యాదలతో వారిని స్వాగతించారు. వేదపండితులు ఆశీస్సులందజేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ఆళ్ళ శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పవన్‌పై విమర్శలు అర్ధరహితం



రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ అన్ని మతాలను గౌరవిస్తాడని, అలాంటి నాయకునిపై కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిల లేనిపోని విమర్శలు చేయడం అర్ధరహితమని నెల్లూరులోని జనసేన నాయకులు కాకు మురళి, నూనె మల్లికార్జునయాదవ్, న్యాయవాది శ్రీరామ్ అన్నారు. ఈనెల 6న నగరంలోని జనసేన పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ, పవన్‌కు పెరుగుతున్న జనాదరణ చూసి ఓర్వలేకే ఆయనపై విమర్శలు చేస్తున్నారన్నారు. పవన్‌కల్యాణ్ ప్రాయశ్చిత్త దీక్ష చేస్తే, దానిని కూడా కించపరుస్తూ వ్యాఖ్యలు చేయడం మంచిపద్ధతి కాదన్నారు. పవన్ ఏర్పాటుచేసిన వారాహి సభపై దేశవ్యాప్తంగా సానుకూల చర్చ జరుగుతోందని, పవన్ కల్యాణ్ వంటి నిబద్ధత కలిగిన నాయకుడు ఉండడం ఆంధ్రరాష్ట్ర ప్రజల అదృష్టమని అన్నారు. ఇకనైనా పవన్‌పై విమర్శలు కట్టిపెట్టిండంటూ వారు హితవు పలికారు. ఈ సమావేశంలో జనసేన నాయకులు ఏటూరి రవికుమార్, నాగరత్నంయాదవ్, గుర్రం కిషోర్, మనోజ్ పాల్గొన్నారు.

## రోడ్డు భద్రతా చర్యలపై సమావేశం



రోడ్డు భద్రతా చర్యలపై ఈనెల 8న జిల్లా కలెక్టర్ ఆనంద్ అధ్యక్షతన కలెక్టరేట్‌లో రోడ్డు భద్రతా కమిటీ సమావేశం జరిగింది. రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా భద్రతా చర్యలు సకాలంలో చేపట్టాలని కలెక్టర్ ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు. ఈ ఏడాది ఇప్పటివరకు రోడ్డు ప్రమాదాల్లో 350 మంది మరణించారని, ప్రమాదాలకు కారణాలను తెలుసుకుని భవిష్యత్‌లో ఎటువంటి ప్రాణనష్టం జరగకుండా రోడ్డుభద్రతా చర్యలు కట్టుదిట్టంగా చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. జాతీయ రహదారిపై ద్విచక్రవాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించేలా చర్యలు తీసుకోవాలని, హైవే ఎంట్రన్స్, ఎగ్జిట్స్ పాయింట్ల వద్ద తనిఖీలు చేపట్టి వాహనదారులు హెల్మెట్లు ధరించేలా చూడాలన్నారు. నెల్లూరు-తడ జాతీయ రహదారిపై నిర్మిస్తున్న 6లైన్ల రహదారికి అనుసంధానంగా సర్వీసు రోడ్లను కూడా ప్రతిపాదించాలని నేషనల్ హైవే అధికారులకు సూచించారు. వాహనదారులు విశ్రాంతి తీసుకునేలా హైవేపై ఎంపిక చేసిన ప్రదేశాల్లో 5 నుంచి 10 ఎకరాల స్థలంలో పెట్రోలు బంకు, డ్రైవర్ల విశ్రాంతి గదులు, హోటళ్లు, పార్కింగ్(వే సైడ్ అమినిటీస్) వగైరా సౌకర్యాలన్నీ ఒకేచోట కల్పించేలా కేంద్రప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని సూచించారు. తొలుత, రోడ్డు ప్రమాదాల నివారణకు చేపడుతున్న కార్యక్రమాలను రవాణా శాఖ ఉప కమిషనర్ చందర్ వివరించారు. రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు రవాణా శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని, అన్ని కళాశాలలు, ఉన్నతపాఠశాలలలో ఈ కార్యక్రమాలు చేపడుతున్నామని ఆయన తెలిపారు. ఆర్టీఓలు శ్రీచందన, సుధాకర్‌రెడ్డి, నాగలక్ష్మి, డిఎస్పీ శ్రీనివాసరావు, ఎన్‌హెచ్ అధికారులు విద్యాసాగర్, తదితరులు పాల్గొన్నారు.

## సత్రాలను బాగుచేసిన..దాతలకు సన్మానాలు



నెల్లూరు పప్పులవీధి పార్కు వద్ద ఉన్న శ్రీ నిత్యానంద సరస్వతి వేద సంస్కృత పాఠశాల, కర్మక్రతువుల సత్రాల బాగుకు సహకరించిన దాతల సేవలు అమూల్యమంటూ ఆ సత్రాల ఆధునీకరణ కమిటీ సభ్యులు కొనియాడారు. శిథిలావస్థకు చేరిన వాటిని బాగుచేయించినందుకు దాతలను అభినందించారు. ఈనెల 6న ఆ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో కమిటీ సభ్యులు కొండా ప్రవీణ్‌శంకర్, యాదాల నందకిషోర్, పాటిబోలు సుబ్బరామయ్య మాట్లాడుతూ, ఈ సత్రాల బాగుకు 25 మంది దాతలు సాయం అందించారని తెలిపారు. పాఠశాల కార్యనిర్వహణాధికారి దర్గయ్య తదితరులు పాల్గొని దాతలను శాలువలతో ఘనంగా సన్మానించారు.






## డీఎఫ్ఓగా బాధ్యతలు చేపట్టిన మహబూబ్ బాషా



జిల్లా అటవీ శాఖ అధికారి (డిఎఫ్ఓ)గా నియమితులైన కె.మహబూబ్ బాషా ఈనెల 7న నెల్లూరు వేదాయపాళెంలోని అటవీశాఖ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. తొలుత, పలువురు రేంజర్లు, అటవీ సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు. గతంలో రాపూరు రేంజర్‌గా, ఇన్‌చార్జి డిఎఫ్ఓగా కూడా పనిచేసి ఉండడంతో ఆయనకు జిల్లాలోని అడవుల పరిస్థితులపై మంచి అవగాహన కూడా ఉంది.

# రైల్వేల అభివృద్ధిపై దృష్టి సారించిన ఎంపీ వేమిరెడ్డి



జిల్లాలో రైల్వేల అభివృద్ధిపై నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దృష్టి సారించారు. ఇటీవల విజయవాడలో జరిగిన రైల్వేబోర్డు సమావేశంలో ఆయన పలు సూచనలు చేశారు. నెల్లూరుజిల్లా పరిధిలో రైల్వేల అభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చి కృషి చేయాలని కోరారు. దక్షిణమధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్, ఇతర ముఖ్య అధికారులతో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన జిల్లాలో రైల్వేపరంగా ఉన్న వివిధ సమస్యలను ప్రస్తావించారు. బిట్రగుంటలో ఉన్న రైల్వే భూములను సద్వినియోగం చేసుకోవాల్సిన ఆవశ్యకతను ఎంపీ వేమిరెడ్డి వివరించారు. బిట్రగుంట రైల్వేస్టేషన్ పరిధిలోని 700 ఎకరాల విస్తీర్ణంలో 400 ఎకరాల భూమిని అభివృద్ధి చేయవచ్చని తెలిపారు. అదేవిధంగా జాతీయ రహదారి-16కి ఆనుకుని ఉన్న బిట్రగుంటలో అభివృద్ధికి చాలా అవకాశం ఉందన్నారు. ఇక్కడ రైల్వే ప్రాజెక్టులు తీసుకువస్తే ఎంతో ఉపయోగంగా ఉంటుందని తెలిపారు. అదేవిధంగా, కృష్ణపట్నం ఓడరేవు, జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్, రామాయపట్నం ఓడరేవులు బిట్రగుంటకు దగ్గరలోనే ఉన్నాయని, అక్కడ కార్యాలయ భవనాలు, రైల్వే క్వార్టర్స్, మెయింటెనెన్స్ డిపో, తగినంత నీటి సరఫరా, మెడికల్ రిలీఫ్ వ్యాన్, ఆఫీసర్స్ రెస్ట్‌హౌస్‌లు, డ్రైవర్లు-గార్డుల కోసం రన్నింగ్ రూమ్‌లు, రైల్వే హెల్త్ యూనిట్ వంటి సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయన్నారు. నెల్లూరు ప్రధాన రైల్వే స్టేషన్‌లో చేపట్టిన అభివృద్ధి పనులను కూడా ప్రస్తావిస్తూ, 2022లో మంజూరైన పనులు చాలా ఆలస్యంగా జరుగుతున్నాయని, పనులు త్వరగా పూర్తిచేసేలా కాంట్రాక్టర్‌కు తగిన ఆదేశాలు ఇవ్వాలని సూచించారు. పనులు పూర్తయితే ప్రయాణికులకు ఇబ్బందులు తొలగుతా యని, దాంతోపాటు నెల్లూరు పరిధిలో రైల్వే హాస్పిటల్ ఏర్పాటును కూడా పరిశీలించాలని సూచించారు.

## నడికుడి-శ్రీకాళహస్తి రైల్వేలైను పూర్తి చేయండి :

నెల్లూరు పశ్చిమ ప్రాంతానికి ఎంతో ముఖ్యమైన నడికుడి- శ్రీకాళహస్తి రైల్వే లైన్ స్థితిగతులపై ఎంపీ వేమిరెడ్డి మాట్లాడుతూ, అక్కడ భూసేకరణ ఆలస్యంగా జరుగుతోందని, దాన్ని వేగవంతంచేసి త్వరితగతిన నడికుడి-శ్రీకాళహస్తి రైల్వేలైన్‌ను అందుబాటులోకి తీసుకురావాలన్నారు. విజయవాడ-గూడూరు మధ్య ఏర్పాటుచేస్తున్న మూడో లైన్ పనుల్లో వేగం పెంచాలన్నారు. కోవూరు నియోజకవర్గంలో ఉన్న పడుగుపాడు రైల్వేస్టేషన్‌లో ఫుట్‌ఓవర్ బ్రిడ్జి గత 8నెలలుగా మూసివేయడంతో ప్రయాణికులు ప్లాట్‌ఫాంలు మారేందుకు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే దాన్ని బాగుచేసి తిరిగి ప్రారంభించాల్సి ఉందన్నారు. రైల్వేస్టేషన్‌లో తాగునీటి సమస్య, మరుగుదొడ్ల సమస్యలున్నాయని, వాటిని పరిష్కరించి ప్రయాణికుల అవస్థలు తొలగించాలని కోరారు. అల్లూరురోడ్డు, పడుగుపాడు, వెంకటేశ్వరపాలెం, తెట్టు-ఉలవపాడు, కొండాయపాలెం, వేదాయపాలెం వంటి రైల్వే క్రాసింగ్‌ల వద్ద ఆర్వోబీ, ఆర్‌యూబీలను ఏర్పాటుచేయాలని, జిల్లా పరిధిలో పలు ముఖ్య స్టేషన్లలో ఎక్స్‌ప్రెస్ రైళ్ల హాల్టింగ్‌కు సంబంధించి సమస్యలు కూడా ఉన్నాయని తెలిపారు. ఉలవపాడులో కృష్ణా ఎక్స్‌ప్రెస్, బిట్రగుంటలో విక్రమసింహపురి ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్, గూడూరులో వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ కల్పించాలని కోరారు. వీటన్నింటిపై సానుకూలంగా స్పందించిన రైల్వే జీఎం, జిల్లాలో రైల్వే సమస్యల పరిష్కారానికి తప్పకుండా కృషిచేస్తామన్నారు.

# ఎన్నికలప్పుడే రాజకీయ తంత్రం.. ఆ తరువాతంతా అభివృద్ధి మంత్రం

## • బుచ్చి కౌన్సిల్ సమావేశంలో ప్రశాంతమ్మ



అభివృద్ధి విషయంలో రాజకీయాలకు అతీతంగా అందరం పనిచేయాలని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి చెప్పారు. బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయితీ కార్యాలయంలో ఇటీవల జరిగిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ, బుచ్చి పట్టణాన్ని అభివృద్ధిపథంలో పయనింపజేయాలన్నారు. రాజకీయాలను ఎన్నికల వరకే పరిమితం చేయాలని.. పంతాలు-పట్టింపులకు పోయి పట్టణ పురోగతిని అడ్డుకోవద్దని సభ్యులకు సూచించారు. గత ప్రభుత్వంలో జరిగిన తప్పులు పునరావృతం కాకుండా కౌన్సిలర్లు వార్డులు అభివృద్ధి చేసుకోవాలని కోరారు. అభివృద్ధి పనులకు సంబంధించి ఏ అవసరమొచ్చినా పార్టీలకు అతీతంగా కౌన్సిలర్లు నేరుగా తనను సంప్రదించవచ్చని తెలిపారు. బుచ్చి మున్సిపల్ ఛైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

### కనకదుర్గమ్మవారికి.. ప్రశాంతమ్మ ప్రత్యేక పూజలు

శరన్నవరాత్రుల సందర్భంగా బుచ్చిరెడ్డిపాళెం, రాఘవరెడ్డి కాలనీలో వెలసివున్న శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయంలో ఇటీవల జరిగిన కుంభాభిషేకంలో కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

అనంతరం, బుచ్చి 3వ వార్డులో ఉన్న శ్రీ దుర్గాదేవి అమ్మవారి ఆలయాన్ని ప్రశాంతమ్మ సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుచ్చి టీడీపీ ముఖ్య నాయకులు హరికృష్ణ, శేషయ్య, బెజవాడ వంశీరెడ్డి, హనీష్, బాలశేఖర్, ప్రత్యూష, కల్యాణ్, వింజం మహేష్, రమేష్ నాయుడు, రామానాయుడు తదితరులు పాల్గొన్నారు.

# సోమిరెడ్డి మనుమరాలి సాయం

## • వరదబాధితులకు రూ. 5 లక్షల విరాళం



మాజీమంత్రి, సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మనుమరాలు అమైరా తన పుట్టినరోజును పురస్కరించుకుని విజయవాడ వరదబాధితులకు 5 లక్షల రూపాయలను విరాళంగా ఇచ్చింది. ఆ చెక్కును ఈనెల 5న విజయవాడలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు ఆ చిన్నారి అందజేసింది. ఈ సందర్భగా లోకేష్ అమైరాకు పుట్టినరోజు శుభాకాంక్షలు చెప్పారు. ఈ కార్యక్రమంలో సోమిరెడ్డి కుమారుడు, సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, కోడలు శృతిరెడ్డి, మనుమడు రణదేవ్‌రెడ్డి పాల్గొన్నారు.

# మాగుంట కుటుంబాన్ని పరామర్శించిన మంత్రి నారాయణ




పార్లమెంట్ మాజీ సభ్యురాలు దివంగత మాగుంట పార్వతమ్మ కుటుంబసభ్యులను రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ, కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మతో కలిసి పరామర్శించారు. పార్వతమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి వారు నివాళులర్పించారు. అనంతరం పార్వతమ్మ కుమార్తె మాలిని, కోడలు మమత, మనుమడు సుబ్బరామ్‌లను ఓదార్చారు.









శ్రీ షిరిడి సాయిబాబా వారి విజయదశమి మహాసమాధి మహోత్సవములు

గాంధీనగర్, ట్రంకురోడ్డు - నెల్లూరు.

తేది. 12-10-2024 శనివారం నుండి 14-10-2024 సోమవారం వరకు

పై దినములలో ప్రతిరోజు ఉ॥ 7.00గం.ల నుండి శ్రీ బాబా వారికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకములు, సామూహిక సహస్రనామ, అష్టోత్తర పూజలు జరుగును.

పై పూజలలో పాల్గొనదలచిన భక్తులు మందిర గుమస్తా వద్ద రూ.250/- చెల్లించి తగిన రశీదు పొంది బాబావారి తీర్థప్రసాదములు స్వీకరించి బాబావారి కృపకు పాత్రులగుదురని కోరుచున్నాము.

ఇట్లు: కార్యవర్గము

శ్రీ షిరిడి సాయిబాబా మందిరం

గాంధీనగర్, ట్రంకురోడ్డు - నెల్లూరు. ఫోన్. 0861 - 2327771.

# గోడ పత్రికలు వద్దు.. పోస్టర్లు లేని నగరమే ముద్దు!

## • నెల్లూరుని 'పోస్టర్ ఫ్రీ సిటీ' చేస్తానంటున్న మంత్రి నారాయణ



నెల్లూరు నగరంలో గోడలపై ఎక్కడంటే అక్కడ పోస్టర్లు అతికించడం వల్ల నగరం అందవిహీనంగా తయారవుతుందని, నగరాన్ని సుందర నందనం చేయాలంటే నెల్లూరు సిటీలో ఒక్క పోస్టర్ కూడా ఉండకూడదని, నగరాన్ని 'పోస్టర్ ఫ్రీ సిటీ'గా మార్చాలన్నదే తన లక్ష్యమని రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి నారాయణ స్పష్టం చేస్తున్నారు. ఇటీవల ఆయన నెల్లూరులోని ఆత్మకూరు బస్టాండ్ ఫ్లైవోవర్ బ్రిడ్జి కింద ఉన్న గోడలకు అంటించిన పోస్టర్లను స్వయంగా తీసివేశారు. అగ్నిమాపక శాఖ వారి సహాయంతో...వాటర్ మిషన్‌తో ఆ గోడలను పరిశుభ్రం చేశారు. ప్రజలందరూ నెల్లూరు నగరాన్ని అందంగా ఉంచుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. గతంలో ఇదేవిధంగా రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలకు ఆదేశాలు ఇచ్చామని, అందులో 90 శాతం సక్సెస్ అయ్యామని గుర్తు చేశారు. ఆ రోజు కూడా నెల్లూరులో ఈ పరిశుభ్రతా కార్యక్రమాన్ని ప్రారంభించామని చెప్పారు. భారత పూర్వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు ఆ విషయాన్ని ప్రత్యేకంగా చెప్పారని, దీనిపై వెంటనే స్పెషల్ డ్రైవ్ నిర్వహించి పోస్టర్ ఫ్రీ కార్యక్రమాన్ని 90శాతం చేయగలిగామని ఆయన తెలిపారు. ఈసారి నెల్లూరు సిటీని పూర్తిస్థాయిలో పోస్టర్ ఫ్రీ సిటీగా మార్చాలని ఇప్పటికే కమిషనర్‌కి, అధికారులకి ఆదేశాలు జారీచేశామని చెప్పారు. నగరంలోని గోడలపై ఉన్న పోస్టర్లను క్లీన్ చేసేందుకు కార్పొరేషన్ అధికారులు ప్రయత్నం చేస్తున్నారన్నారు. వారం రోజుల్లో ఒక్క పోస్టర్ కూడా ఉండకూడదని అధికారుల్ని ఆదేశించడం జరిగిందన్నారు. ప్రకటనలన్నీ సోషల్ మీడియాలో ఇచ్చుకోవాలని... గోడలపై అంటించకూడదని చెప్పారు. అభివృద్ధి చెందిన దేశాల్లో ఎక్కడా వాల్‌పోస్టర్లు కనిపించవని తెలిపారు. నగరం అందంగా ఉండాలంటే పోస్టర్లు ఉండకూడదన్నారు. ముఖ్యంగా తన ఫ్లెక్సీలు కూడా ఎక్కడున్నా తొలగించాలని కమిషనర్‌కు చెప్పారు. ఇక నుంచి ఫ్లెక్సీలు ఎవరూ కట్టవద్దని నెల్లూరు నగర ప్రజలకు ఆయన విజ్ఞప్తి చేశారు.



# జిల్లాలో ఇక..పుష్కలంగా ఇసుక

జిల్లాలో ఇసుక పుష్కలంగా ఉందని, మూడు యార్డుల్లో సుమారు 70వేల టన్నుల ఇసుక నిల్వలు ఉన్నాయని, ఇసుకకు కొరత లేదని జిల్లా కలెక్టర్ ఆనంద్, ఎస్పీ కృష్ణకాంత్ చెప్పారు. ఈనెల 6న కలెక్టరేట్‌లో వారు సమావేశం నిర్వహించి, ఇసుకను జిల్లా ప్రజలకు అందుబాటులో ఉంచేందుకు అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. జిల్లాలో గత ఏడాది కంటే ఇప్పుడు ఇసుకను 50 శాతం మేరకు తక్కువ ధరకే ఇస్తున్నామన్నారు. టన్ను ఇసుక కేవలం రూ. 350కే అందిస్తున్నామని, మన జిల్లాకే కాక ప్రకాశం, బాపట్ల జిల్లాలకు కూడా ఇసుకను అందిస్తామని తెలిపారు. కందుకూరులో మరో ఇసుక యార్డు ఏర్పాటు చేస్తామని, ఈనెల 15న మరో 4 రీచ్‌లు కూడా ప్రారంభిస్తామని వివరించారు.

### అక్రమాలు జరగకుండా నిఘా :

ప్రభుత్వం కొత్తగా చేపట్టిన ఇసుక విధానంలో ఎక్కడా అక్రమాలు జరగకుండా పటిష్టమైన నిఘా ఏర్పాట్లు చేశామని జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ తెలిపారు. నెల్లూరు నగర పాలక సంస్థలోని కమాండ్ కంట్రోల్ సెంటరులో ఫెసిలిటేషన్ సెంటరు, హెల్ప్ డెస్క్‌తో పాటు 8 మంది సచివాలయ ఉద్యోగుల బృందాన్ని ఏర్పాటుచేశామని, వారు రవాణా దారులతో సమన్వయం చేసుకుని సకాలంలో ఇసుకను సరఫరా చేస్తారని ఆయన చెప్పారు. ఎవరైనా సరే, ఇసుక అక్రమరవాణాకు పాల్పడితే క్రిమినల్‌కేసులు నమోదు చేస్తామని ఎస్పీ స్పష్టం చేశారు. ఇసుకకు సంబంధించి ఏమైనా ఫిర్యాదులుంటే టోల్‌ఫ్రీ నంబరు 0861-2943569కి ఫోన్ చేసి తెలపవచ్చన్నారు.

### బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించాలి :

జిల్లాలో బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించడానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆనంద్ అధికారులను ఆదేశించారు. ఈనెల 8న బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన జిల్లాస్థాయి టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జిల్లాలోని పరిశ్రమల్లో, షాపుల్లో పనిచేసే బాల కార్మికులను గుర్తించాలని, బాలకార్మికులతో ఎవరైనా పని చేయిస్తుంటే ఆయా పరిశ్రమలు, షాపుల యజమానులపై కఠిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. పరిశ్రమల్లో గుర్తించిన బాల కార్మికులను శిశు గృహాలకు చేర్చాలని ఆయన తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు, బడి మానేసిన పిల్లల వివరాలను తీసుకొని స్వయంగా తనిఖీలు చేపట్టాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో జిల్లాసాంఘిక సంక్షేమ అధికారి శ్రీనివాసరావు, జిల్లా విద్యాశాఖ అధికారి పి.రామారావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పెంచలయ్య, కార్మిక శాఖ ఉప కమిషనర్ వెంకటేశ్వర్లరావు, మహిళా శిశు సంక్షేమ శాఖ డిసిపిఓలు సమత, సుమతి, స్వచ్ఛంధ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# 14 నుంచి 'పల్లెపండుగ'

## పంచాయతీ వారోత్సవాలకు సిద్ధంకండి - ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ వీడియో కాన్ఫరెన్స్

రాష్ట్రంలో ఈనెల 14వ తేదీ నుండి 21వ తేదీ వరకు 'పల్లె పండుగ' పేరుతో పంచాయతీరాజ్ వారోత్సవాలను ఘనంగా నిర్వహించడానికి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ అధికారులను ఆదేశించారు. ఈనెల 8న అమరావతి సచివాలయం నుండి వారోత్సవాల నిర్వహణపై జిల్లా కలెక్టర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా పవన్‌కల్యాణ్ మాట్లాడుతూ, రాష్ట్రంలో జాతీయ ఉపాధి హామీ పథకం నిధులతో చెక్‌డ్యాములు, వాటర్‌షెడ్లు, నీటి కుంటలు, సిమెంట్ రోడ్లు, సిమెంట్ డ్రైన్లు, పంటకాలువలకు సంబంధించిన పనులను చేపట్టాలన్నారు. రాష్ట్రంలో ఉద్యాన పంటలకు జాతీయ ఉపాధి హామీ నిధులతో పనులు చేపట్టాలన్నారు. పల్లెపండుగ పంచాయతీరాజ్ వారోత్సవాల్లో జాతీయ ఉపాధిహామీ పనులతో చేపట్టే పనులకు శంకుస్థాపనలు చేయాలన్నారు. ఆ పనులన్నీ కూడా జనవరి నాటికి పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. ఈ సమావేశంలో నెల్లూరు కలెక్టరేట్ నుంచి కలెక్టర్ ఆనంద్ పాల్గొన్నారు. వారోత్సవాలకు జిల్లాలో 57.73 కోట్ల రూపాయలతో పనులు చేపట్టడానికి చర్యలు తీసుకున్నామని ఆయన చెప్పారు.

## తిరుపతి జిల్లా గూడూరు డివిజన్

# మహిళలు చట్టాలు తెలుసుకోవాలి



మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని జూనియర్ సివిల్ జడ్జి సులోచనరాణి తెలిపారు. గూడూరు పట్టణంలోని డిఆర్‌డబ్ల్యు కళాశాలలో మహిళలకు ఇటీవల న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు భాగ్యలక్ష్మి, మహబూబ్ బాషా, కళాశాల ప్రిన్సిపాల్ హనుమంతరావు, వైస్ ప్రిన్సిపాల్ గాయత్రి, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

# జెండా ఉత్సవంలో దాడి కేసులో నలుగురు అరెస్టు



గూడూరు పట్టణంలో ఈ నెల 2వ తేదీ రాత్రి జరిగిన జెండా ఉత్సవంలో కత్తితో దాడి చేసిన వేరు వేరు ఘటనల్లో నలుగురు నిందితులను అరెస్టు చేసి, రౌడీషీట్ తెరుస్తున్నట్లు ఒకటో పట్టణ సి.ఐ శేఖర్‌బాబు తెలిపారు. ఇటీవల నిందితుల వివరాలను విలేకర్ల సమావేశంలో ఆయన వెల్లడించారు. చిన్నమసీదు వీధికి చెందిన హరీష్, యశ్వంత్‌పై అశోక్‌నగర్‌కు చెందిన రాపూరు మనోజ్, మరో మైనర్ బాలుడు కత్తితో దాడి చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు నిందితులను అరెస్టు చేసినట్లు తెలిపారు. మరో ఘటనలో నిందితులైన ముగ్గురిని సోమవారం తాళమ్మ గుడి సమీపంలో అరెస్టు చేసినట్లు సి.ఐ తెలిపారు. ఎస్సై తిరుమలరావు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఎంపిడిఓగా మధుసూదన్‌రావు



గూడూరు ఎంపిడివోగా మధుసూదన్‌రావు ఇటీవల పట్టణంలోని ఎం.పి.డి.వో కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఆయన అనంతసాగరం నుంచి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

# ఉద్యమాలతోనే సంఘం బలోపేతం



పటిష్టమైన ఉద్యమాలతోనే వ్యవసాయ కార్మిక సంఘం బలోపేతం అవుతుందని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్.కోటేశ్వరరావు, ఆవుల శేఖర్ అన్నారు. ఈనెల 8న గూడూరు, షాదీమంజిల్‌లో వ్యవసాయ కార్మిక సంఘం తిరుపతి జిల్లా జనరల్ బాడీ సమావేశం ఆ సంఘం జిల్లా అధ్యక్షులు తులసీరాజన్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో వ్యవసాయ కూలీలు, పేదలను సమీకరించి వారి సమస్యల పరిష్కారం కోసం సంఘం ఉద్యమించాలన్నారు. ఏపీ పీఎస్ఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్నం పెంచలయ్య, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు టి.కృష్ణప్ప, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తులసీరాజన్, సీహెచ్.ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



# డా. సి.ఆర్.రెడ్డి ఆరోగ్య సంజీవని

పేద ప్రజల డాక్టర్లుగా పిలవబడే డా. సి.జనార్ధన్‌రెడ్డి, డా. రోహిణిల సంపూర్ణ సహాయసహకారాలతో ప్రగతి సేవా సంస్థ ప్రతి నెల నిర్వహించే 'డా. సి.ఆర్.రెడ్డి ఆరోగ్య సంజీవని' కార్యక్రమం ఇటీవల నిర్వహించారు. 30మంది ఎయిడ్స్ వ్యాధి బాధితుల జీవన ప్రమాణాలు పెంచడానికి పౌష్టికాహారం పంపిణీ చేశారు. సంస్థ అధ్యక్షులు కడివేటి చంద్రశేఖర్, డాక్టర్ రవికుమార్, మామదూరు రాధయ్యకుమార్‌నాయుడు, రిటైర్డ్ ఎస్సై ప్రభాకర్, మురళీనాయుడు, శివకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు లయన్స్ క్లబ్ వైద్య పరీక్షలు

లయన్స్ క్లబ్ ఆఫ్ గూడూరు వైజేపీ & టౌన్ సేవా కార్యక్రమాల్లో భాగంగా ఇటీవల గూడూరులోని డివిఎస్ఆర్ కమ్యూనిటీ హాల్ సమీపంలోని పేదలకు బీపీ, షుగర్ టెస్టులు ఉచితంగా నిర్వహించారు. సాయి ల్యాబ్ అధినేత వి.మురళీకృష్ణ, ఝాన్సీలు సుమారు 100మందికి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బండ్ల సుధాకర్, బండ్ల హరికృష్ణలు దాతృత్వం వహించారు. క్లబ్ ప్రెసిడెంట్ పి.వి.మనోజ్‌కుమార్, సీనియర్ సభ్యులు ఆర్.వి. రావు, మురళీరాజు, ఎస్ఎల్ఎన్ స్వామి, బండ్ల వాణి, ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

# పనే పనిగా.. అదే పనిగా.. అలసిపోతున్న 'సాఫ్ట్' యువత!



అమెరికాలోని ఫిలడెల్ఫియాలో అదో పెద్ద జౌళి పరిశ్రమ. రెండో పారిశ్రామిక విప్లవం కాలంలో వచ్చిన సాంకేతిక పరిజ్ఞానం ఫలితంగా ఏర్పాటయిన కంపెనీల్లో ఒకటి. 1920ల్లో సంగతి ఇది. ఉత్పాదకతపై కంపెనీ యజమాని ఏ మాత్రం సంతృప్తిగా లేడు. ఏం జరుగుతోందో తెలుసుకోవాలని ప్రముఖ మానసిక శాస్త్రవేత్త, పారిశ్రామిక పరిశోధకుడు అయిన ఎల్టన్ మాయోను కోరారు. ఆయన ఆ కంపెనీలో, షికాగోలోని వెస్టర్న్ ఎలక్ట్రిక్ కంపెనీలో పని పరిస్థితులపై, అంటే కార్మికుల పనితీరు, వారి మానసిక పరిస్థితులు, కంపెనీలోని పని వాతావరణం, అధికారుల వ్యవహారశైలి, యజమానుల తీరు.. మొదలైన అంశాలను అధ్యయనం చేసి ప్రయోగాత్మకంగా కొన్ని మార్పులు, చేర్పులు చేశారు. ఆశ్చర్యకరంగా అద్భుతమైన సానుకూల ఫలితాలు రాబట్టారు. కార్మికులు నిర్విరామంగా పనిచేయడాన్ని గమనించి రోజు మొత్తంలో రెండుసార్లు విరామం ఇవ్వడం, వారందరితోనూ బహిరంగంగా సమావేశమై వారి కష్టసుఖాలు వినడం వంటి చిన్న చిన్న మార్పులతో ఉత్పాదకతలో గణనీయమైన మెరుగుదల తీసుకొచ్చారు. ఎల్టన్ మాయో చేసిన ఈ ప్రయోగం 'ఫిలడెల్ఫియా ప్రయోగంగా' ఇప్పటికీ పర్సనల్ మేనేజ్‌మెంట్ కోర్సుల్లో, బిజినెస్ మేనేజ్‌మెంట్ కోర్సుల్లో బోధిస్తుంటారు. ఆర్గనైజేషన్ థియరీకి శ్రీకారం చుట్టింది ఈ ప్రయోగమే. ఈ పాత కథ ఇప్పుడెందుకు ప్రస్తావించుకోవాల్సి వచ్చిందంటే, రెండో పారిశ్రామిక విప్లవ కాలంలో కార్మికులు ఎదుర్కొన్న తీవ్ర కష్టాల్లాంటివే... ఇప్పుడు ఐటీ విప్లవం దాటి కృత్రిమ మేధ విప్లవం ప్రవేశించిన కాలంలోనూ సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో పనిచేసే సిబ్బంది ఎదుర్కొంటున్నారు. ఇంకా చెప్పాలంటే, అప్పటికన్నా ఇప్పుడు ఇంకా ఎక్కువ ఒత్తిడే ఉంటోందని చెప్పొచ్చు. ఆ మధ్య పుణెలో ఒక ప్రముఖ బహుళజాతి సంస్థలో పనిచేసే యువతి గుండెపోటుతో మరణించింది. సుదీర్ఘ పని గంటలు, పనిఒత్తిడితోనే తమ కుమార్తె మరణించిందని ఆ యువతి తల్లి కన్నీళ్లు పెట్టుకోవడం అప్పట్లో దేశమంతా చూసింది. అయితే, తాము అందరికీ ఇచ్చినంత పనే ఇచ్చామని, అదనపు పనేమీ ఇవ్వలేదని ఆ కంపెనీ ఉన్నతాధికారి వివరణ ఇచ్చారు. ఆ యువతి పని ఒత్తిడితోనే మరణించిందా లేదా అన్నది రుజువు చేయలేం కానీ సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో, బహుళజాతి సంస్థల్లో పనిచేస్తున్నవారు తీవ్ర పని ఒత్తిడిని ఎదుర్కొంటున్నారన్నది మాత్రం వాస్తవం. ముఖ్యంగా ఎక్కువ పని గంటలతో వారి మనసుకు, శరీరానికి విశ్రాంతి లేకుండా పోతోంది. 'వర్క్ ఫ్రం హోం' చేసేవారు ఉదయం 8గంటలకు లాగిన్ అయితే తెల్లవారు జామున 3గంటల వరకు కూడా నిర్విరామంగా పనిచేస్తున్న ఉదాహరణలున్నాయి. ఒక్కొక్క ఉద్యోగి చేత ఏకకాలంలో రెండు ప్రాజెక్టుల్లో పనిచేయిస్తున్న అమానవీయ ఉదాహరణలూ లేకపోలేదు. ఎక్కువ పనిగంటలను చట్టపరిధిలోకి తీసుకురావాలని కూడా పలు సాఫ్ట్‌వేర్ సంస్థలు కోరుకుంటున్నాయి. అంతకన్నా అమానవీయం మరోటి ఉండదు.

## ఎక్కువ పనితో.. ఆరోగ్యానికి ముప్పు

మనకున్నది రోజుకు 24 గంటలు. దీన్ని మూడు సమ భాగాలుగా చేస్తే ఒక్కో భాగం 8 గంటలు అవుతుంది. కనీసం రాత్రి పూట 8 గంటలు నిద్ర అవసరం. మిగిలేది 16 గంటలు. అందులో కాలకృత్యాలు, వ్యాయామం, స్నానాదులు, అల్పాహారం, కుటుంబ అవసరాలకు వెచ్చించే సమయం సుమారు నాలుగు గంటలు. మిగిలిన పన్నెండు గంటల్లో ఎనిమిదిన్నర గంటలు పనికి, అరగంట భోజనానికి తీసివేస్తే, మిగిలేది కేవలం మూడు గంటలు. ఈ మూడు గంటల్లో రెండు గంటలు ప్రయాణానికి సరిపోతుంది. అంటే రోజులో కేవలం గంట మాత్రమే కుటుంబసభ్యులతో ఉల్లాసంగా గడపగలరు. ఇదంతా సాధారణ పనిగంటల సంగతి. కానీ ఇప్పుడు ఐటీ ఉద్యోగులు 12 నుంచి 14గంటలు పనిచేయాల్సి వస్తోంది. అంటే నిద్రను కానీ, తమ దైనందిన పనుల కోసం కేటయించుకున్న సమయాన్ని కానీ త్యాగం చేయాల్సి వస్తోంది. దీంతో, పని-వ్యక్తిగత జీవితం సమతౌల్యం దెబ్బతింటోంది. ఇదే తీవ్ర ఒత్తిడికి కారణమవుతోంది. ఎక్కువ పని గంటల వల్ల పక్షవాతవ్యాధి ముప్పు 35 శాతం, గుండె వ్యాధుల ముప్పు 17శాతం పెరుగుతుందని ప్రపంచ ఆరోగ్య సంస్థ అధ్యయనం వెల్లడిస్తోంది. సంస్థలు ఈ సమస్యను గుర్తించి మానవ వనరులను మానవసంబంధాల వారధులుగా కూడా గుర్తించి పనిఒత్తిడి తగ్గించే ప్రయత్నం చేయాలి. ప్రభుత్వాలు దీనిని, జాతీయ, సామాజిక సమస్యగా గుర్తించి తక్షణం ఉపశమన చర్యలు చేపట్టి చట్టబద్ధమైన రక్షణలు కల్పించాలి.

ఎల్టన్ మాయో ప్రయోగాలను స్ఫూర్తిగా తీసుకొని నిపుణులతో అధ్యయనం చేయించి, లోపాలను సరిదిద్దాలి. క్లయింటుకు, పనిచేసే వ్యక్తికి మధ్య పలు అంచెల్లో పర్యవేక్షణ ఉంటోంది. వీరంతా ఆ ఉద్యోగితో రోజులో పలుమార్లు కాల్స్‌లోకి వస్తారు. ఇదంతా తీవ్ర ఒత్తిడికి కారణమవుతోంది. ఇలాంటి లోపాలన్నింటినీ సరిచేసుకోవాలి. ఐటీ ఉద్యోగులు కూడా పని-వ్యక్తిగత జీవిత సమతౌల్యానికి ప్రాధాన్యత ఇవ్వాలి. ఎప్పుడు 'నో' చెప్పాలో తెలుసుకోవాలి. ఎంత ఒత్తిడి పడినా భరిస్తూ పోతే చివరకు కుటుంబానికి అన్యాయం చేసిన వారవుతారు. 'నో' చెప్పడం నేర్చుకోవాలంటే ఆర్థిక క్రమశిక్షణ, ఆర్థిక ప్రణాళిక చాలా అవసరం. అవసరానికి మించి బ్యాంకు రుణాలు, ఈఎంఐలు ఉండకుండా చూసుకోవాలి. ఈ పరిస్థితి భారత్‌లోనే కాదు. అంతర్జాతీయంగా పలుదేశాల్లోనూ ఉంది. అమెరికాలోని ఒక ప్రముఖ కార్ల తయారీ కంపెనీ అన్ని విభాగాల వారినీ రోజూ చేసే పనికి అదనంగా కోడింగ్, ప్రోగ్రామింగ్ నేర్చుకోవాలని ఆదేశించింది. సంస్థకు కావాల్సిన సాఫ్ట్‌వేర్‌ను బయటనుంచి కొనుక్కోకుండా, కొత్తగా ప్రోగ్రామర్లను నియమించుకోవాల్సిన అవసరం లేకుండా చేసుకోవడానికట. దక్షిణ కొరియా, చైనా యువ ఉద్యోగులు పని ఒత్తిడి నుంచి ఉపశమనం పొందడానికి కేన్సర్ రోగులకు ఉపయోగించే చికిత్స విధానాన్ని ఉపయోగిస్తున్నారు. ద్రవరూప విటమిన్లను సెలైన్ ద్వారా ఎక్కించుకుంటున్నారు. ఇటువంటి పరిణామాలు మానవాళి శ్రేయస్సుకు ఏమాత్రం దోహదం చేసేవి కావు. భారత్ ఈ విషయంలో జాగ్రత్త పడి అటు కంపెనీలకు, ఇటు ఉద్యోగులకు శ్రేయస్కరంగా ఉండే ఆదర్శవంతమైన పని ప్రదేశాలను, పని విధానాలను రూపొందించాల్సిన అవసరం ఉంది.



తుమ్మల బాల గంగాధర్ తిలక్



## జానకిరామ.. రామాయణం (34)

- ఊటుకూరు జానకి రామారావు

రాముడు అలా ప్రయాణం చేస్తూనే ఉన్నాడు. కోసల దేశాన్ని దాటి వాయువేగ మనోవేగాలతో రథం ప్రయాణం చేస్తోంది. దారిలో వేదశృతి, గోమతీ, స్యందిక అనే నదులను దాటారు.

మధ్యమధ్యలో సుమంత్రుడితో ప్రేమగా సంభాషిస్తూ ఇంత అందమైన నా జన్మభూమికి తిరిగివచ్చి సరయూ నదిలో మరల ఎప్పుడు క్రీడిస్తానో కదా అని పలుకుతూ దారి పొడవునా ఉన్న అందమైన ప్రదేశాలను సీతకు చూపుతూ ఉల్లాసంగా ముందుకు సాగుతున్నాడు.

దారిలో తనను కలువ వచ్చిన గ్రామస్థులు తనస్థితిని చూసి దుఃఖిస్తుంటే.. వారందరికీ హితంచెప్పి "ఎక్కువకాలం రోదించటం మంచిదికాదు, పాపం" (చిరం దుఃఖస్య పాపీయః) అని చెప్పి వారితో మధురంగా సంభాషించి సాయంసంధ్యా సమయంలో కనుమరుగయ్యే సూర్యుడిలా కనపడకుండా వేగంగా వెళ్ళిపోతున్నాడు రామచంద్రుడు.

వెళ్ళి, వెళ్ళి ఉత్తుంగ తరంగాలతో, మంగళప్రదమై నాచులేకుండా నిర్మలంగా ఉన్న జలాలతో, దేవ, దానవ, గంధర్వ, కిన్నెరులు సదా సేవించే గంగానదిని చూశారు.

ఆ గంగ నీరు కొన్నిచోట్ల అట్టహాసంగా భయంకరంగా ఉంది, కొన్ని చోట్ల జలతరంగ ఘోష మృదంగధ్వనిని పోలి ఉంది, కొన్ని చోట్ల దీర్ఘంగా ప్రవహిస్తూ జలం అందమైన స్త్రీల పొడుగాటి జడలా వంపులు తిరిగి వయ్యారంగా సాగుతోంది.

కొన్నిచోట్ల సుడులు తిరుగుతూ చూసేవారికి భయంగొల్పుతూ ఉంది! కొన్నిచోట్ల విశాలమై తెల్లటి ఇసుకతిన్నెలు వ్యాపించి ఉన్నాయి.

హంసలు, సారసపక్షులు, చక్రవాకములు, నదిలో విహరిస్తూ, క్రీడిస్తూ మనోహరమైన ధ్వనులుచేస్తూ సంగీతగోష్టులు జరుపుతున్నట్లుగా ఉన్నాయి.

నది ఒడ్డున పెరిగిన వృక్షరాజాలు పచ్చని మాలల లాగా గంగాదేవిని అలంకరిస్తున్నాయి.

ఏ విధమైన మలినాలు లేకుండా నిర్మలస్ఫటికమణికాంతితో జలాలు శోభిల్లుతున్నాయి.

ఇంత అందమైన గంగ ఒడ్డున ప్రయాణం చేస్తూ.. సీతారాములు తమను తాము మరచిపోయారు. ఏకబిగిన ప్రయాణంచేస్తూ శృంగబేరిపురం వద్ద గంగ సమీపంలోకి చేరుకున్నారు.

ఆ నది ఒడ్డున ఒక మహావృక్షం క్రింద ఆ రాత్రికి విశ్రమించాలని రామచంద్రుడు నిర్ణయించుకొని సుమంత్రుని రథం ఆపమన్నాడు.

శ్రీరామ ఆగమన వార్త ఏ గాలి చెప్పిందో తెలవదుగానీ! రాముడి ప్రియమిత్రుడు, ప్రాణసమానుడు నిషాదరాజు అయిన గుహుడు పరివారంతో సహా అక్కడ వచ్చి వాలాడు.

గుహుడు కనపడగానే రాముడి అంతరంగంలో ఆనందం పొంగి పొర్లింది. తన ఆత్మసమానుడైన సఖుడు తన ఎదురుగా ఉన్నాడు. అంతే! తన దృఢమైన బాహువులలో బంధించాడు.

ప్రాణ సఖుడిని కౌగలించుకొని క్షేమ సమాచారం కనుక్కొన్నాడు.

గుహుడి కంట నీరు ఆగటంలేదు, రామా! నీకు అయోధ్య ఎట్లో ఈ నగరమూ అంతే, నీకోసం నన్నేం చేయమంటావో చెప్పు, నీ వంటి ప్రియాతిప్రియమైన అతిథి మరెవ్వరికైనా దొరుకుతాడా! అని పలికాడు.

మా రాముడొస్తున్నాడని భక్ష్య, భోజ్య, లేహ్య, చోష్య, పానీయాదులతో కూడిన అమృతప్రాయమైన తినుబండారాలు తెచ్చాడు గుహుడు.

అవి రాజులు ఆరగించేవి!. వాటిని తన ప్రియమిత్రుడికి అర్పించగా వాటిని సున్నితంగా తిరస్కరించాడు రాముడు.

తానిప్పుడు తాపసవృత్తి అవలంభించిన విషయం గుర్తుచేసి తను ఆహారంగా స్వీకరించేది కందమూలఫలాలు కావున పంచభక్ష్యపరమాన్నాలు తాను స్వీకరించలేను అని, తన అశ్వాలు తన తండ్రి గారివి కావున వాటికి శ్రేష్టమైన మేత తెప్పించమన్నాడు. అప్పుడు గుహుడు ఆ గుర్రాలకు ఆహార, పానీయాదులు అందచేశాడు.

రాముడు నారచీరను ఉత్తరీయంగా ధరించి సాయం సంధ్యను అర్చించి, లక్ష్మణుడు తెచ్చిన నీటిని మాత్రమే ఆహారంగా స్వీకరించాడు.

చీకట్లు నలుదెసలను కప్పివేశాయి, రాత్రి వేళ అది! రాముడు భార్యాసమేతుడై కటిక నేలమీద పడుకున్నాడు. అది చూసిన గుహుడి దుఃఖమాగలేదు.

లక్ష్మణుడికి చక్కని పక్క ఏర్పాటు చేసి నీవు కూడా విశ్రమించవయ్యా అన్నాడు గుహుడు. మేమందరం శ్రమజీవులం, నీవు రాకుమారుడవు, రాముడి కోసం మేమంతా ఈ రాత్రి మేల్కొనే ఉంటాం. నీవు హాయిగా నిదురపో!

రాముని రక్షణ బాధ్యత నాది, నేను నమ్ముకొన్న సత్యంపై ఒట్టేసి చెపుతున్నాను నాకు రామునికన్నా ప్రియమైనది ఈ ప్రపంచంలో లేదు. నీవు చింతలేకుండా నిదురపో అని అన్నాడు.

అప్పుడు లక్ష్మణుడు గాద్గదికమైన గొంతుతో!

ఎవరు ధనుస్సు ఎక్కుపెట్టి నిలుచుంటే సమస్త దేవగణాలు గజగజ వణికిపోతాయో!

ఎవరి ధనుష్టంకారం దానవుల గుండెల్లో గుబులు పుట్టిస్తుందో...



అట్టి జగదేక వీరుడు రాముడు నేడు నేలపై పవళిస్తే నాకు నిద్రెలా పడుతుంది?

నా తండ్రి ఎన్నో నోములు వ్రతాలు యజ్ఞాలు చేస్తే ఆయనకు లభించినవాడు ఈ రాముడు.

అట్టి పుణ్యాల ప్రోవు రాముడు నేడు నేలపై నిదురిస్తూ ఉంటే నేనెలా విశ్రమించగలను.

ఈ రాముడు కనపడక ఆ తండ్రి కూడా ఎక్కువ కాలం జీవించడు, కొద్దికాలంలోనే ఈ భూమి భర్త లేనిదవుతుంది.

గుహుడు, లక్ష్మణుడు ధనుర్ధారులై వారిని సంరక్షిస్తూ, ఒకరితో ఒకరు మాట్లాడుకుంటూ, సుమంత్రుడితో సంభాషిస్తూ ఉండగానే రాత్రి గడిచిపోయింది.

***భాస్కరోదయ కాలోయం గతా భగవతీ నిశా***
***అసౌ సుకృష్ణో విహగః కోకిలస్తాత కూజతి***

నాయనా పూజ్యురాలైన రాత్రి గడిచింది, సూర్యోదయ సమయం ఆసన్నమైంది. చాలా నల్లనిదైన పక్షి కోకిల కూస్తుంది.(పూజనీయురాలైన రాత్రి అట, వందే వాల్మీకి కోకిలం).

రామచంద్రుడు నిదురలేచాడు. ఆయనకు కోకిల కూతలు, నెమళ్ల క్రేంకారాలు సుప్రభాతగీతికలై మేల్కొలుపులు పాడాయి. (ప్రకృతి ఏర్పాటు చేసిన వందిమాగధులు వీరు).

లేచిన వెంటనే ఆలస్యం చేయకుండా తాము చేయవలసిన పనిని లక్ష్మణునకు చెప్పాడు. వెంటనే గంగ దాటాలి.

లక్ష్మణుడు ఆ వార్త గుహుడికి చేరవేశాడు! హుటాహుటిన గుహుడప్పుడు దృఢమైనది, చక్కగా అలంకరింపబడినది, సమర్ధులైన నడుపువారు కలది, అయిన నావను రేవులో సిద్దం చేసి, రాముని వద్ద వినమ్రుడై నిలుచున్నాడు. అప్పుడు రాముడు ఆనందంగా మిత్రమా మమ్ము ఆవలి ఒడ్డుకు చేర్పించవయ్యా అని పలికాడు.

ఇంతలో సుమంత్రుడు వచ్చి రామా ఏమి ఆజ్ఞ అన్నట్లుగా చేతులు మోడ్చి నిలుచున్నాడు.

.. (సశేషం)

# అస్తమించిన పారిశ్రామిక సూర్యుడు

(మొదటిపేజీ తరువాయి)

**'అవకాశాల కోసం ఎదురుచూడకూడదు.**
**ఆ అవకాశాల్ని మనమే సృష్టించుకోవాలి'...**
అన్నదే రతన్ టాటా నినాదం. పారిశ్రామిక రంగంలో అత్యంత ప్రతిభా పాటవాలతో రాణిస్తూ, అందుకు తగ్గట్టుగా మరింత ఎదుగుదలకు తగ్గ అవకాశాల్ని తానే సృష్టించు కుంటూ ఆయన ఒక్కొక్క మెట్టూ ఎదిగారు. నిరంతరం శ్రమిస్తూ, లక్ష్యసాధన కోసం తపిస్తూ, అనుకున్న లక్ష్యాలను సాధిస్తూ అత్యున్నత శిఖరాలను అధిరోహించారు.

ధనం కన్నా.. దానగుణమే మిన్నగా భావించారు. తానెంత ఉన్నత స్థాయిలో ఉన్నా పేదల వైపు, ప్రజల కష్టాల వైపు కూడా దృష్టి సారించారు. గొప్ప మానవీయతతో.. అపార దాన గుణంతో ఎందరి జీవితాలనో గట్టెక్కిం చారు. ఆదర్శవంతమైన జీవితం గడపడమే కాదు, స్వయంగా ఆదర్శవంతంగా ఉండడమే ఆయన నైజం. ఇది దేశంలోనే కాదు, ప్రపంచంలోనే అరుదైన విషయం. అందుకే, రతన్ టాటా అంటే ప్రపంచంలో మహా మానవీయమూర్తిగా.. ఎంతో గొప్ప పేరు. భారతదేశానికే కీర్తిపతాకగా, అత్యంత ప్రభావశీలుడైన పారిశ్రామిక వేత్తగా.. ప్రపంచానికే వెలుగులందించే స్ఫూర్తిప్రదాతగా నిలిచిన పారిశ్రామిక సూర్యుడాయన. దేశ పారిశ్రామిక రంగానికి ఆయనే దిక్సూచి. దేశానికి తనవంతు సేవలందిస్తూనే, మరోవైపు తన మానవీయతతో లక్షలాదిమందికి దారిదీపంగా వెలుగులు చూపిన మహనీయుడుగా రతన్ టాటా అందరి హృదయాల్లో శాశ్వతముద్ర వేసుకున్నారు. కష్టాలను అధిగమిస్తూ.. నిరంతర కృషి, పట్టుదలతోనే ఆయన అత్యున్నత స్థాయికి చేరుకున్నారు.

### అంచెలంచెలుగా ఎదిగారు

1937 డిసెంబర్ 28న ముంబైలో నావల్ టాటా-సోనూ దంపతులకు రతన్ టాటా జన్మించారు. 1955లో న్యూయార్క్‌లో డిగ్రీ పూర్తిచేసి, హార్వర్డ్ బిజినెస్ స్కూల్‌లో అడ్వాన్స్ మేనేజ్‌మెంట్ కోర్సు చదువుకున్నారు. 1962లో టాటా స్టీల్‌లో చేరడం ద్వారా తన వృత్తి జీవితాన్ని ఆరంభించారు. 1977లో టాటా గ్రూప్‌కు చెందిన ఎంప్రెస్ మిల్స్‌లో చేరారు. అది అప్పట్లో కష్టాల్లో ఉండడంతో, దాన్ని అభివృద్ధి చేసేందుకు రతన్ టాటా సిద్ధమైనా, టాటా గ్రూప్‌లోని ఉన్నతాధికారులు సహకరించకపోవడంతో అది మూతపడింది. ఆ తర్వాత, 1991లో టాటా సన్స్ ఛైర్మన్‌గా జేఆర్డీ టాటా వైదొలగి, రతన్ టాటాను తన వారసునిగా ప్రకటించడంతో, టాటాసన్స్ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టి, పట్టుదల-నిరంతర కృషితో దానిని వేల కోట్ల డాలర్ల సామ్రాజ్యంగా విస్తరించారు. టాటామోటార్స్, టాటా స్టీల్, టీసీఎస్, టాటా గ్లోబల్ బెవరేజెస్, టాటా కెమికల్స్, టాటా టెలిసర్వీసెస్, ఇండియన్ హోటల్స్ వంటి వెన్నో రతన్ టాటా చేతి రతనాలే. టీసీఎస్‌ను వెయ్యికోట్ల డాలర్ల వార్షికాదాయం అధిగమించిన సంస్థగా ప్రఖ్యాతిలోకి తెచ్చిన ఘనత కూడా ఆయనదే. భారత ఆటోమొబైల్ సంస్థలకు కార్లను తయారుచేసే సత్తాలేదన్న విమర్శలను సహించలేక, 'ఇండికా' కారు తయారీతో భారత్ సత్తా ఏమిటో నిరూపించారు. అంతేకాదు, నష్టాల బాటలో ఉన్న బ్రిటన్ కంపెనీలైన జాగ్వార్, లాండోవర్ కంపెనీలను కొనుగోలు చేసి, వాటిని లాభాల దారిలో పెట్టిన ఘనత.. రతన్ టాటాదే. మధ్యతరగతి ప్రజలకు కూడా కార్లలో తిరగాలనే కలను సాకారం చేయాలని కేవలం లక్ష రూపాయలకే 'నానో' కారు తయారుచేసి, సామాన్యులకు అందు బాటులోకి తెచ్చారు.

భారత ప్రభుత్వం ఆయన సేవలకు, దాతృత్వానికి గుర్తుగా 2002వ సంవత్సరంలో ప్రతిష్ఠాత్మకమైన 'పద్మభూషణ్' బిరుదును, 2008లో 'పద్మ విభూషణ్' బిరుదులతో గౌరవించింది. ఏదేమైనా భారత్ కీర్తిని ప్రపంచవ్యాప్తం చేసిన రతన్‌టాటా లేకపోవడం.. అత్యంత బాధాకరం. ఆయన మరణంతో.. భారతీయ పారిశ్రామిక రంగంలో ఒక శకం ముగిసినట్లయింది.

## ప్రముఖుల సంతాపం

**ఆయన సేవలు నిరుపమానం** - రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

'భారత్ ఒక గొప్ప పారిశ్రామిక దిగ్గజాన్ని కోల్పోయింది. దాతృత్వం, సేవా కార్యక్రమాల్లో ఆయన భాగస్వామ్యం నిరుపమానమైనదంటూ'.. భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తన సంతాపం తెలిపారు.

**అసాధారణ వ్యక్తి – పారిశ్రామిక శక్తి** - ప్రధాని మోడీ

రతన్ టాటా దార్శనిక వ్యాపారవేత్త అని, దయార్ద్రహృదయుడని, మానవీయత మూర్తీభవించిన అసాధారణ వ్యక్తి, పారిశ్రామిక శక్తి అనీ, సమాజాన్ని మెరుగుపరచేందుకు నిరంతరం కృషిచేశారని భారత ప్రధాని నరేంద్రమోడీ పేర్కొన్నారు.

**ఆయన జీవితం ఆదర్శం** - వెంకయ్యనాయుడు

నిష్కళంక పారిశ్రామికవేత్త, గొప్ప దార్శనికుడు రతన్ టాటా మరణం విచారకరమని, ఆయన ఆదర్శ జీవితం భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తుందని భారత పూర్వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు తన సంతాపంలో తెలిపారు.

**గొప్ప మానవతావాది** - ముఖ్యమంత్రి చంద్రబాబు

రతన్‌టాటా మరణంతో ఒక వ్యాపార దిగ్గజాన్నే కాదు, గొప్ప మానవతావాదిని కూడా కోల్పోయామని, దార్శనికత, సమైక్యభావనతో ఆయన తనదైన ముద్ర వేశారంటూ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పేర్కొన్నారు.

**విలువలు కలిగిన వ్యక్తి** - మంత్రి నారాయణ

రతన్ టాటా, కేవలం పారిశ్రామికవేత్తగా మాత్రమే కాకుండా ఉన్నతమైన విలువలు కలిగిన ఆదర్శవాది అని, ఆయన జీవితం అందరికీ ఆదర్శమని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ పేర్కొన్నారు.

**పారిశ్రామిక రంగానికి తీరని లోటు** - వేమిరెడ్డి దంపతులు

భారతదేశ పారిశ్రామిక రంగానికి మూలస్తంభమైన టాటా గ్రూప్‌ను నెలకొల్పి ఎన్నో గొప్ప సేవలు అందించిన దార్శనికుడు, జాతీయవాది రతన్ టాటా మృతి దేశానికి తీరని లోటని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి తమ సంతాపం వ్యక్తం చేశారు.

## రతన్ టాటాతో శ్రీసిటీకి అనుబంధం :





రతన్ టాటాకు శ్రీసిటీతో అనుబంధం ఉంది. గతంలో ఆయన ఒకసారి శ్రీసిటీకి వచ్చారు. దేశంలో రెడీ-టు-ఈట్ (ఆర్‌టిఇ) మార్కెట్‌లో రెండవ అతిపెద్ద సంస్థగా పేరున్న టాటా స్మార్ట్‌ఫుడ్జ్ లిమిటెడ్ (టీఎస్‌ఎఫ్‌ఎల్) పరిశ్రమ స్థాపించడానికి రతన్ టాటా శ్రీసిటీని ఎన్నుకున్నారని, అలాగే శ్రీసిటీలోని క్రియా విశ్వవిద్యాలయం పాలకమండలికి సలహాదారుగా కూడా ఆయన ఉన్నారని ఈ సందర్భంగా శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి తెలిపారు. రతన్ టాటాకు శ్రీసిటీతో వున్న అనుబంధాన్ని ఆయన జ్ఞాపకం చేసుకున్నారు. శ్రీసిటీ పారిశ్రామిక కుటుంబం తరపున, టాటా కుటుంబానికి, టాటా గ్రూప్‌కు రవీంద్ర సన్నారెడ్డి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

**గొప్ప దార్శనికుడు** - రవీంద్ర సన్నారెడ్డి

గొప్ప దార్శనికతకు, భారతీయ పరిశ్రమకు, దాతృత్వానికి మారుపేరైన టాటా సన్స్ గ్రూప్ మాజీ ఛైర్మన్ రతన్ నావల్ టాటా మృతి బాధాకరమని శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఒక ప్రకటనలో తన ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ఆ మహోన్నత వ్యక్తికి ఆయన ఘనంగా నివాళులు అర్పిస్తూ, తరతరాలకు స్ఫూర్తినిచ్చే దార్శనికుడిని భారతదేశం కోల్పోయిందని విచారం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా, 2019, ఏప్రిల్ 16న రతన్ టాటా శ్రీసిటీ సందర్శించినప్పటి విషయాలను ఆయన గుర్తుచేసుకున్నారు. 'అంకితభావం, చిత్తశుద్ధితో ఏమి సాధించవచ్చో చెప్పడానికి శ్రీసిటీ సరైన ఉదాహరణ' అంటూ అప్పట్లో రతన్ టాటా అభినందించారని, ఆయన మాటలు తమకెంతో గౌరవప్రదమని అన్నారు. దేశ నిర్మాణం, వ్యాపార నైతికత, దాతృత్వం మొదలైన అంశాలలో రతన్ టాటా చేసిన అసమానమైన కృషి సమాజానికి స్ఫూర్తినిస్తుందని ఆయన పేర్కొన్నారు. అంతేకాదు, రతన్ టాటా విలక్షణ నాయకత్వం, వ్యాపార రంగంలోని వారికి మార్గదర్శనం చేస్తుందని కొనియాడారు.



# టీడీపీ గూటికి చేరిన బీదా, మోపిదేవి

రాజ్యసభ మాజీసభ్యులు బీదా మస్తాన్‌రావు, మోపిదేవి వెంకటరమణ టీడీపీలో చేరారు. ఈ నెల 9వ తేదీ బుధవారం ఉండవల్లి నివాసంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సమక్షంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. మస్తాన్‌రావు, వెంకటరమణలకు పార్టీ కండువాలు కప్పి చంద్రబాబు వారిని సాదరంగా ఆహ్వానించారు. పలువురు మంత్రులు, ఎంపీలు, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

# హర్యానాలో కాషాయ జెండా!

(మొదటిపేజీ తరువాయి)

పెరిగిపోతున్న ధరలు, నిరుద్యోగం వగైరాలతో పాటు స్థానికంగా ఉన్న వర్గపోరుతో సతమతమవుతున్న బీజేపీకి, ప్రజల నుంచి ప్రభుత్వ వ్యతిరేకత బాగా ఉన్నప్పటికీ వ్యూహరచనలో ఆరితేరిన కమలనాధులు అక్కడ అభివృద్ధిమంత్రంతో మళ్ళీ తమ పట్టు నిలుపుకోవడం విశేషం. ఎక్కడ ప్రజల్లో అసంతృప్తి ఉందో, దానిని అధిగమించేందుకు ఏం చేయాలో బీజేపీ అంతా చేసింది. ప్రజలు కోరుకున్నట్లుగా పంటలకు మద్దతు ధర కల్పించడం, ప్రజలకు భారంగా ఉన్న విద్యుత్‌ఛార్జీలు కనీస ధరలను రద్దుచేయడం వంటి నిర్ణయాలు ఎన్నికలకు ముందు చివరి రెండు మూడునెలల్లోనే తీసుకోవడం బీజేపీకి అనుకూలించింది. ప్రభుత్వ వ్యతిరేక తగ్గిపోయి, బీజేపీ పట్ల ప్రజల్లో ఆదరణ పెరిగి, విజయానికి బాటలు వేసింది. అయితే, బీజేపీకి ప్రజల్లో వ్యతిరేక ఉంది కనుక తామే గెలుస్తామని, బీజేపీ వ్యతిరేక ఓటునే నమ్ముకున్న కాంగ్రెస్ డీలాపడిపోయింది. చివరికి, ప్రస్తుత ముఖ్యమంత్రి నయాబ్‌సింగ్ సైనీయే ఇక్కడ మరోసారి ముఖ్యమంత్రి కాబోతున్నారు.

### జమ్ము కశ్మీర్‌లో బీజేపీ డీలా

జమ్ము కశ్మీర్‌ను సమస్యల సుడిగుండం నుంచి గట్టెక్కించామని, 370, 35(ఏ) అధికరణలు తొలగించి, జమ్ము కశ్మీర్‌కు స్వయంప్రతిపత్తి కలిగించి చరిత్రాత్మక నిర్ణయాలతో సంచలనం కలిగించిన బీజేపీకి అక్కడ ఈ ఎన్నికల్లో చేదు అనుభవమే ఎదురైంది. నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ, కాంగ్రెస్ కూటమి కలిసి ఇక్కడ ఘన విజయం సాధించాయి. ఆర్టికల్ 370 రద్దుతో పాటు జమ్ము కశ్మీర్‌ను కేంద్రపాలిత ప్రాంతాలుగా చేసిన తర్వాత జరిగిన ఈ తొలి ఎన్నికల్లో, మొత్తం 90 స్థానాల్లో ఎన్‌సీ 42 స్థానాలు గెలుచుకుని అనూహ్యమైన విజయం సాధించింది. దాంతోపాటు కాంగ్రెస్ 6 స్థానాల్లో తమ ఆధిక్యతను నిరూపించుకుంది. ఎన్‌సీ తరపున పోటీచేసిన ఒమర్‌అబ్దుల్లా రెండు చోట్ల పోటీచేసి, రెండుచోట్లా విజయం సాధించారంటే అక్కడ ఆ పార్టీకి ఎంత ఆదరణ ఉందో చెప్పవచ్చు. బీజేపీకి ఇక్కడ 29 స్థానాలే లభించాయి. అందులోనూ దాదాపు పదేళ్ళ తర్వాత జమ్ము కశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలకు మోక్షం కలిగింది. కొత్త కశ్మీర్‌ను కళ్లముందు నిలబెడతామని బీజేపీ ఎంతగా చెప్పినా, కశ్మీరీలు పెద్దగా స్పందించలేదు. దీంతో కశ్మీర్‌లో మనదే విజయం అనుకున్న కమలదళం కలలు కల్లలుగానే మిగిలాయి. ఎన్ని అభివృద్ధి మంత్రాలు వల్లించినా కశ్మీర్‌లోయలో అత్యధిక స్థానాల్లో కమలదళానికి ప్రతికూల ఫలితాలే వచ్చాయి. నేషనల్ కాన్ఫరెన్స్-ఇండియా కూటమికే కశ్మీరీలు మద్దతు పలికారు. కశ్మీరీ ప్రజలకు తమకెంతో గౌరవంగా భావించే రాష్ట్ర హోదా లేకపోవడం అక్కడి ప్రజలను తీవ్ర నిరాశకు గురిచేసింది. సరిగ్గా ఆ అంశాన్నే ఇండియా కూటమి ఎజెండగా మార్చుకుని ఎన్నికల్లో ఘన విజయం సాధించింది. దీంతో ఏళ్ళ తరబడి ఆ రాష్ట్రాన్ని పాలిస్తున్న అబ్దుల్లాల కుటుంబానికే కశ్మీర్ ప్రజలు జై కొట్టారు. గతంలో కంటే ఎక్కువగా మొత్తం 23.43 శాతం ఓట్లతో ఎన్‌సీ అతిపెద్ద పార్టీగా అవతరించింది. కశ్మీర్‌లో నేషనల్ కాన్ఫరెన్స్ తరపున పోటీచేసిన ఒమర్ అబ్దుల్లాయే పోటీచేసిన రెండుచోట్లా కూడా గెలిచాడు. జమ్ముకశ్మీర్ బీజేపీ అధ్యక్షుడు రవీందర్ రైనా కూడా ఓడిపోయాడు. అయితే, గతంలో కంటే బీజేపీకి ఇక్కడ ఎక్కువ ఓట్లు వచ్చాయి. 29 స్థానాలతో రెండో అతిపెద్ద పార్టీగా తయారుకావడమే కాక, ఓట్ల శాతం కూడా 23 నుంచి 25.64 శాతానికి పెరగడం బీజేపీకి కొంత ఊరటనిస్తోంది.

# ఎన్‌బికెఆర్ విద్యార్థుల ప్రతిభ

## కోడింగ్ హాకథాన్‌లో ప్రథమ స్థానం



కోట మండలం విద్యానగర్‌లో ఉన్న ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు కోడింగ్ హాకథాన్‌లో తమ ప్రతిభను చాటుకున్నారు. తిరుపతిలోని మోహన్‌బాబు విశ్వవిద్యాలయంలో ఈనెల 4 నుండి 6వ తేదీ వరకు జరిగిన మోహన్‌మంత్ర కార్యక్రమంలో 183 టీమ్‌లు పాల్గొన్నాయి. అందులో ఎన్‌బికెఆర్ సిఎస్‌ఇ, ఏఐడిఎస్ విభాగాల్లోని నలుగురు విద్యార్థులు..నిమ్మల జశ్వంత్, డి. రేణుక, కె. నందిని, జె.జ్యోత్స్నలు ప్రథమస్థానంలో నిలిచి 35వేల రూపాయల బహుమతిని అందుకున్నారు. విజేతలను కళాశాల డైరెక్టర్ డా.వి.విజయకుమార్‌రెడ్డి, క్లోడింగ్ క్లబ్ ఇన్‌ఛార్జి డా.జీవీ కొండారెడ్డి, సిఎస్‌ఇ విభాగాధిపతి డా.వి.రాజశేఖర్‌రెడ్డి, ఏఐడిఎస్ విభాగాధిపతి డా.అప్పిని నారాయణరావు తదితరులు అభినందించారు.

## జొన్నవాడ కామాక్షితాయి అమ్మవారికి

# లక్ష్మీకాసుల హారం



ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన జొన్నవాడలోని శ్రీ మల్లికార్జున సమేత కామాక్షితాయి అమ్మవారికి ఈనెల 6న తిరుపతికి చెందిన సత్యనారాయణ-శోభాలక్ష్మి దంపతులు 52 గ్రాములా 184 మిల్లీగ్రాముల బరువున్న బంగారు లక్ష్మీకాసుల హారాన్ని సమర్పించుకున్నారు. అర్చకస్వామి శ్రీధర్‌తో కలిసి, ఆలయ ఇఓ అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డికి ఆ హారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన దాతల గోత్రనామాలతో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించారు. ఆలయ అర్చకులు వారిని ఆశీర్వదించారు.

# పంట కాలువల పూడిక తీయించండి

జిల్లాలోను, నెల్లూరు నగరంలోనూ ఉన్న పంటకాలువల్లో వెంటనే పూడికలు తీయించి పరిశుభ్రం చేయించాలని రైతుసంఘం జిల్లాశాఖ అధ్యక్షుడు షానవాజ్ కోరారు. ఈనెల 5న నెల్లూరు సంతపేటలోని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) కార్యాలయం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పంటకాలువలు గుర్రపుడెక్కతో నిండిపోయి, సాగునీరు పొలాలకు అందడానికి ఇబ్బందిగా ఉందని, అధికారులు స్పందించి వాటిని తొలగించాలని విజ్ఞప్తిచేశారు. సీపీఐ నగర సహాయ కార్యదర్శి సయ్యద్ సిరాజ్, వ్యవసాయ కార్మికసంఘం జిల్లా కార్యదర్శి నందిపోగు రమణయ్య, కౌలురైతుల సంఘం జిల్లా అధ్యక్షుడు నెల్లూరు రమణయ్య, చాంద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

# మనుబోలులో నవరాత్రి వేడుకలు



మనుబోలులోని కోదండరామపురంలో వెలసివున్న శ్రీ పోలేరమ్మ అమ్మవారి దేవస్థానంలో నవరాత్రి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా పోలేరమ్మతల్లి ఈనెల 6న లలితాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు అమ్మవారికి ఈ సందర్భంగా ప్రత్యేకపూజలు, పంచామృతాభిషేకాలు చేశారు. పసుపుకుంకుమలతో అభిషేకించారు. పెద్దసంఖ్యలో మహిళా భక్తులు పాల్గొని సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. ఆరూరు అనిల్‌కుమార్‌రెడ్డి, అనితమ్మ దంపతులు ఉభయదాతలుగా వ్యవహరించగా, ఆలయ నిర్వాహకులు పర్యవేక్షించారు.



# విఎస్‌యులో జాబ్ మేళా

## • 25 మందికి ఉద్యోగాలు

ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీ ఎస్ఎస్‌డిసి), జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసు, సీడాప్ సంయుక్తంగా ఇటీవల స్థానిక విక్రమ సింహపురి యూనివర్సిటీ (విఎస్‌యు)లో నిర్వహించిన జాబ్ మేళాలో ఇంటర్, డిగ్రీ అర్హత గల 44 మంది నిరుద్యోగ యువత పాల్గొన్నారు. ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్, ఇన్నోవ్ సోర్స్ ప్రైవేట్ లిమిటెడ్, శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్, క్రెడిట్ ఆక్సిస్, గ్రామీణ సంస్థలు పాల్గొని, 25 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న విఎస్‌యు వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎస్. విజయ భాస్కరరావు మాట్లాడుతూ యువతకు ఉపాధి అవకాశాలను అందించడంలో భాగంగా ఇలాంటి జాబ్‌మేళాలు నిర్వహించడం ఎంతో ముఖ్యమని అన్నారు. యువత తమ విద్యా నైపుణ్యాలను సమర్థంగా వినియోగించుకొని, ఈ ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. విఎస్‌యు స్కిల్ హబ్ ఇన్‌ఛార్జ్ డాక్టర్ మేరీ సందీప, ఏపీ ఎస్ఎస్‌డిసి జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి అబ్దుల్ ఖయ్యూమ్, సీడాప్ జేడీ ఎం.హైమవతి, స్కిల్‌హబ్ కోఆర్డినేటర్ జి.సాయిహిమంత్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు సామాజిక స్పృహతో రాణించాలి



విద్యార్థులు సామాజిక స్పృహతో రాణించాలని నెల్లూరులోని పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ శంకరయ్య చెప్పారు. ఇటీవల రాష్ట్రీయ ఏక్తా పర్వ్-2024ను పురస్కరించుకుని విద్యార్థులకు రెండురోజుల పాటు 10 అంశాల్లో పోటీలుపెట్టి, విజేతలకు సర్టిఫికెట్లు బహుకరించి అభినందించారు. ఈ కార్యక్రమాల్లో ఆయన మాట్లాడుతూ.. ఇలాంటి కార్యక్రమాలకు విద్యార్థులకు ఉత్సాహాన్నిస్తాయని, నైపుణ్యాలను పెంపొందించుకోవడానికి కూడా ఉపయోగపడతాయని అన్నారు. ఈ పోటీల్లో ప్రథమ బహుమతి సాధించిన విద్యార్థినీ విద్యార్థులు ఈనెల 21వ తేదీ నుండి విశాఖపట్టణంలో జరిగే రీజనల్‌స్థాయి పోటీల్లో పాల్గొంటారని ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జోషిబాబు, దొరసానమ్మ, అలివేలుమంగాబాయి, ప్రభాకర్, ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు, రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# పెంచలకోనలో వేడుకగా.. శరన్నవరాత్రి ఉత్సవాలు

జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలోని శ్రీ పెనుశిల లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఈనెల 6న ఆలయ అర్చకులు శ్రీ ఆదిలక్ష్మి అమ్మవారికి ధైర్యలక్ష్మి అలంకారాన్ని శోభాయమానంగా నిర్వహించి శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి మూలమూర్తికి పుష్పాలంకరణ చేసి, పంచామృతాభిషేకం నిర్వహించారు. సాయంత్రం సామూహిక కుంకుమార్చన సేవ జరిగింది. అనంతరం, పూలంగిసేవ, ప్రాకారోత్సవాల్లో అమ్మవారు భక్తులకు నేత్రపర్వంగా దర్శనమిచ్చారు. ఆలయ ఉప కమిషనర్ పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షణలో ఆలయ ప్రధాన అర్చకులు గుండ్లూరు సీతారామయ్యస్వామి, పెంచలయ్యస్వామిల ఆధ్వర్యంలో అమ్మవారికి ఈ పూజా కార్యక్రమాలు జరిగాయి.

# స్నేహితుని జ్ఞాపకార్థం.. రక్తదానం



తమ స్నేహితుడు చనిపోయినా, తాము ఆ స్నేహాన్ని మరచిపోకుండా ప్రతిఏటా రక్తదానం చేస్తూ, కావలిలో నాలుగేళ్ళక్రితం ప్రమాదవశాత్తూ మరణించిన తమ మిత్రుడు పుల్లా నాగరాజు జయంతిని పురస్కరించుకుని ఆయన స్నేహితులు 27 మంది ఈనెల 6న రక్తదానం చేసి తమ మిత్రుని స్మరించుకున్నారు. కావలి రెడ్‌క్రాస్ రక్తకేంద్రంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాగరాజు తండ్రి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, తమ కుమారుడు అనేక సేవా, సాంస్కృతిక కార్యక్రమాల్లో ఎంతో ఉత్సాహంగా పాల్గొనేవాడని, దురదృష్టవశాత్తూ రోడ్డు ప్రమాదంలో మృతిచెందడం తమ కుటుంబానికి, స్నేహబృందానికి తీరని వేదన కలిగిస్తోందని అన్నారు. తమ కుమారుడి జ్ఞాపకార్థం ప్రతి పుట్టినరోజున రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నామని, ఏటా ఈ సేవా కార్యక్రమాన్ని కొనసాగిస్తామని చెప్పారు. నాగరాజు స్నేహితులు పి.బాలాజీ, జి.సాయి, బి.శశి, పి.భావన, వై.వెంకటేశ్వర్లు, వి.నాగేంద్ర, పి.తిరుమలరావు, పి. సురేంద్ర పాల్గొని రక్తదానం చేశారు.

## టూకీగా...



### వేదగిరి నరసింహస్వామికి స్వాతినక్షత్ర పూజలు

నెల్లూరు రూరల్‌లోని నరసింహకొండపై వెలసివున్న శ్రీ వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో ఈనెల 5న స్వామివారి జన్మనక్షత్రం స్వాతినక్షత్రాన్ని పురస్కరించుకుని ప్రత్యేకపూజలు చేశారు. మూలవర్లకు అభిషేకం, తిరుప్పావడ సేవ వేదోక్తంగా నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని ఈ పూజలను తిలకించారు. ఆలయ అధికారులు పర్యవేక్షించారు.

### కందుకూరు మునిసిపాలిటీకి వాటర్‌కూలర్ బహుకరణ

కందుకూరు మునిసిపల్ కార్యాలయానికి వచ్చేవారి దప్పిక తీర్చేందుకు టీడీపీ నాయకులు కొత్తూరు సుధాకర్‌రావు, కొత్తూరు శ్రీనివాసులు వాటర్ కూలర్‌ను బహుకరించారు. ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు చేతులమీదుగా ఈనెల5న ఆ కూలర్‌ను కమిషనర్ కె.అనూషకు అందజేశారు. పట్టణ టీడీపీ అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### చెర్లోపల్లిలో వెంకయ్యస్వామికి ప్రత్యేకపూజలు

మనుబోలు వద్దనున్న చెర్లోపల్లి రైల్వేగేట్ సమీపంలోని అవధూత భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి ఆలయంలో ఈనెల 5న ఆలయ అర్చకులు స్వామివారికి ప్రత్యేకపూజలు చేశారు. పంచామృతాభిషేకాలు, ధునిపూజలతో స్వామివారిని సేవించారు. గంధళ్ల కృష్ణయ్య-అన్నపూర్ణమ్మ దంపతులు ఉభయ కర్తలుగా వ్యవహరించారు. పెద్దసంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

### బుచ్చిలో ఎక్సైజ్ కార్యాలయం తనిఖీ

బుచ్చిరెడ్డిపాళెంలో ఉన్న ఎక్సైజ్‌శాఖ కార్యాలయాన్ని ఈనెల 5న ఆ శాఖ డెప్యూటీ కమిషనర్ శ్రీనివాసరావు ఆకస్మికంగా తనిఖీ చేసి, రికార్డులు పరిశీలించారు. సిబ్బంది పనితీరును ఆరాతీశారు. అక్రమ మద్యం అమ్మకాలు, బెల్ట్‌షాపులపై కఠిన చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. బుచ్చి ఎక్సైజ్ సీఐ కిషోర్‌బాబు తదితరులు ఆయన వెంట ఉన్నారు.

### వెంకటాచలం పోలీస్‌స్టేషన్‌పై పిడుగు

మండల కేంద్రమైన వెంకటాచలం పోలీస్‌స్టేషన్‌పై ఈనెల 4వ తేదీ రాత్రి పిడుగు పడింది. దీంతో, పోలీస్‌స్టేషన్‌లో ఉన్న నిఘా కెమెరాలు, వైర్‌లెస్ సెట్లు, ఫ్యాన్లు, ఇన్వెర్టర్లు వగైరా సామాగ్రి అంతా ధ్వంసమై, సుమారు లక్ష రూపాయల మేరకు నష్టం వాటిల్లినట్లు పోలీసువర్గాలు తెలిపాయి.

### చెముడుగుంటలో పేకాటరాయుళ్ళ అరెస్ట్

వెంకటాచలం మండలం చెముడుగుంట వద్ద ఈనెల 6న పేకాటాడుతున్న ఏడుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.65,700 స్వాధీనం చేసుకున్నారు. సీఐ పి.సుబ్బారావు ఆధ్వర్యంలో ఈ అరెస్టులు జరిగాయి.

### జమ్మిపాళెంలో అగ్నిప్రమాదం.. పూరిల్లు దగ్ధం

కోవూరు మండలం జమ్మిపాళెంలో ఈనెల 6వ తేదీ రాత్రి ఓ గృహిణి వంట చేస్తుండగా, ప్రమాదవశాత్తూ వంట గ్యాస్ లీకై ఆ ఇంటికి మంటలంటుకున్నాయి. అగ్నిమాపక సిబ్బంది వచ్చేలోగా పూరిల్లు పూర్తిగా దగ్ధమైపోయింది. ఇంట్లో వున్న పాతికవేల రూపాయలతో పాటు, మూడు సవర్ల బంగారు నగలు కూడా కాలిపోయాయని బాధితులు వాపోతున్నారు.

### జడదేవిలో జోరుగా ఆక్రమణలు

వరికుంటపాడు మండలం జడదేవి పంచాయతీలో సుమారు 2 వందల ఎకరాల్లో ఉన్న కొండ పోరంబోకు భూములను ఎవరో కొందరు ఆక్రమించేసుకుంటున్నారని, ఇటీవల జేసీబీలతో వచ్చి అక్కడి చెట్లన్నీ కొట్టేస్తున్నారని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. అధికారులకు ఆ సమాచారమిచ్చినా ఎవరూ పట్టించుకోవడంలేదని వారు విచారం వ్యక్తం చేస్తున్నారు.

### మలిదేవి బ్రిడ్జి కూలిపోయే స్థితిలో ఉంది

కొండవలూరు మండలం యల్లాయపాళెం వద్దనున్న మలిదేవి బ్రిడ్జి శిథిలావస్థలో ఉందని, అంచులన్నీ విరిగిపోతున్నాయని, రేపోమాపో కూలిపోతుందేమో అన్నట్లుగా ఉందని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు వెంటనే పరిశీలించి వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా, ఆ వంతెనను బాగుచేయించాలని వారు కోరుతున్నారు.

# నెల్లూరొచ్చిన కేవీపీ..!





మాజీ రాజ్యసభ సభ్యులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, దివంగత మహానేత డాక్టర్ రాజశేఖరరెడ్డికి అత్యంత ఆప్తమిత్రులు డాక్టర్ కే.వీ.పీ.రామచంద్రరావు మంగళవారం (అక్టోబర్ 8) నాడు నెల్లూరొచ్చారు. నగరంలోని సరస్వతినగర్‌లో వున్న మాగుంట నివాసానికి వెళ్ళి, ఇటీవల దివంగతురాలైన మాగుంట పార్వతమ్మ కుటుంబసభ్యులని, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డిని కేవీపీ పరామర్శించారు. అనంతరం నగర మాజీ శాసనసభ్యులు జేకేరెడ్డి నివాసానికి వెళ్ళి కొద్దిసేపు ఆయనతో భేటీ అయ్యారు. జేకేరెడ్డి – రామచంద్రరావుల మధ్యవున్న చిరకాల అనుబంధాన్ని, వారిద్దరి పాత జ్ఞాపకాలని గుర్తుతెచ్చుకున్నారు. అదేరోజు రాత్రి నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్‌లో రామచంద్రరావు తిరిగి హైదరాబాదు వెళ్లిపోయారు.

# చినబాబును కలిసిన అజీజ్, జలీల్



ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తనను రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మెన్‌గా నియమించిన సందర్భంగా ఇటీవల అమరావతిలో రాష్ట్ర విద్యాశాఖమంత్రి నారా లోకేష్‌బాబును కలిసి ధన్యవాదాలు తెలుపుతున్న నెల్లూరు పార్లమెంటు నియోజకవర్గ టిడిపి అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, ఆయన సోదరుడు జలీల్.

### విపిఆర్ చొరవతో.. గాంధీ ఆశ్రమం

# అభివృద్ధికి అడుగులు

## రంగంలోకి దిగిన పర్యాటక శాఖ

ఎట్టకేలకు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి చొరవతో, జిల్లా కలెక్టర్ ఆనంద్ సూచనలతో పర్యాటకశాఖ వారు గాంధీ ఆశ్రమం అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. జిల్లాలో స్వాతంత్ర్యోద్యమ కాలం నాటి ఈ ఆశ్రమం ఎంతో చరిత్రాత్మకమైందని అందరికీ తెలిసిందే. ఇందుకూరుపేట మండలం పల్లిపాడు గ్రామంలో పెన్నానది ఒడ్డున ఈ ఆశ్రమాన్ని స్వాతంత్ర్య యోధురాలు పొణకా కనకమ్మ నిర్మించడం, అప్పట్లో స్వయంగా గాంధీజీయే ఈ ఆశ్రమానికి ప్రారంభోత్సం చేయడంతో ఇది దక్షిణభారత సబర్మతి ఆశ్రమంగా పేరొందింది. ఈ ఆశ్రమాన్ని అభివృద్ధి చేయాలనే సంకల్పంతో వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి చేస్తున్న కృషిలో భాగంగా, పర్యాటకశాఖ అధికారులు ఈనెల 8న ఆశ్రమ కమిటీ సభ్యులతో సమావేశమై, ఆశ్రమానికి అవసరమైన వసతులేమిటో తెలుసుకున్నారు. ముఖ్యంగా రక్షణ గోడ (ప్రహరీ) నిర్మాణానికి, డిజిటల్ గ్రంథాలయం ఏర్పాటుకు, అక్కడున్న అతిథి భవనాలకు మరమ్మతులు చేయించి సందర్శకులకు సౌకర్యయుతంగా ఉండేందుకు, ఓపెన్‌ఎయిర్ ఆడిటోరియం నిర్మాణానికి, జిమ్ ఏర్పాటుకు, వృద్ధాశ్రమంలో వసతులు కలుగజేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. పర్యాటక శాఖ అధికారులు సుబ్రహ్మణ్యం, వంశీకృష్ణ, శ్రీనివాసరావు, ఆశ్రమ కమిటీ సభ్యులు రవీంద్రారెడ్డి, రాజేశ్వరమ్మ, రామిరెడ్డి, ఐఆర్‌సీఎస్ ప్రధానకార్యదర్శి మస్తానయ్య పాల్గొన్నారు.




# ఉత్తరక్రియలు



కంభం శివారెడ్డి గారు

జననం : 01.07.1942 నిర్యాణం : 06.10.2024

తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు
దుత్తలూరు మాజీ ఎం.పి.పి., మాజీ సర్పంచ్
మా ఇంటి పెద్దదిక్కు

## కంభం శివారెడ్డి గారు

తేది. 06.10.2024 ఆదివారం ఉదయం పరమపదించారు.
వారి పవిత్ర ఆత్మశాంతికై ప్రార్థిస్తూ...

- కుటుంబ సభ్యులు

**ఉత్తరక్రియలు**

వారి 'పెద్దకర్మ' తేది. 16.10.2024 బుధవారం
ఉదయం 10.30 గంటలకి
దుత్తలూరులోని వారి స్వగృహము నందు జరుగును.
బంధుమిత్రులకి తెలియజేయడమైనది.

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3.
Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com